PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 116 | విజయవాడ, సోమవారం 27 నవంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 27 November 2023 | Rs

దేశ వ్యాపితంగా మహా పడావ్

- గొంతెత్తిన కార్మిక, కర్షక లోకం

ఛండీగఢ్‌లోని మొహాలిలో ఆదివారం జరిగిన మహాధర్నాకు వేలాదిగా తరలివచ్చిన కార్మికులు, రైతులు. (వార్త 5వ పేజీలో)

ప్రధాని మోడీకి బొకే అందజేసి స్వాగతం పలుకుతున్న సిఎం జగన్‌మోహన్ రెడ్డి, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుమలలో ప్రధాని మోడీ

- అడుగడుగునా నిఘా
- నేడు శ్రీవారి దర్శనం, ప్రత్యేక పూజలు
- స్వాగతం పలికిన గవర్నర్, సిఎం
- ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి-తిరుమల రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం రాత్రి 7.35 గంటలకు తిరుపతి ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అహ్మద్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రధాని రోడ్డు మార్గం గుండా తిరుమలలోని రచన అతిథి గృహానికి 8.25 గంటలకు చేరుకున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో తిరుమల, తిరుపతిని రెండు రోజులపాటు ఎస్‌పిజి కంట్రోల్‌కి తీసుకుంది. మూడు వేల మంది భద్రతా సిబ్బంది అడుగడుగునా భద్రతా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 10.20 గంటలకు శ్రీవారిని ప్రధాని దర్శించుకుంటారు. దాదాపు అరగంటపాటు ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం 12 గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక నావికాదళ విమానంలో బయలుదేరి తెలంగాణ వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. తిరుమల రచన గెస్ట్ హౌస్ వద్ద ప్రధానికి స్వాగతం పలికిన వారిలో టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ ధర్మారెడ్డి ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి స్వాగతం పలకడానికి ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి డిప్యూటీ సిఎం నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఎంపిలు పెద్దిరెడ్డి మిగతా 2లో

నాలుగేళ్లలో

4,709 బడులు మూత

పాఠశాలల విలీనాన్ని నిరసిస్తూ అనంతపురం జిల్లాలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- 2,045 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు తాళం
- ప్రైవేట్ పాఠశాలలు 2,664 కనుమరుగు
- తల్లిదండ్రులకు పెరిగిన ఫీజుల భారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్లలో 4,709 పాఠశాలలు మూతపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల ప్రభావం వల్ల ప్రభుత్వ, ఎయిడెడ్ బడులు మూతకు దారితీశాయి. పెత్తందార్లకు, పేదలకు మధ్య యుద్ధమని, తాను పేదల పక్షమని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ పేదల బడులను లేకుండా చేస్తోంది. సంస్కరణల ప్రభావంతో 2,045 ప్రభుత్వ, ఎయిడెడ్ బడులకు తాళాలు పడ్డాయి. కరోనా ప్రభావంతో చిన్న ప్రైవేట్ పాఠశాలలు నడపలేక 2,664 కనుమరుగయ్యాయి. 2019-20 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో మొత్తం 63,463 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు 61, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు 4,287, స్థానిక సంస్థలు (జెడ్‌పి, ఎంపిపి, మున్సిపల్) ఆధ్వర్యంలో నడిచేవి 40,708, ఎయిడెడ్ విద్యాసంస్థలు 2,234, ప్రైవేట్ పాఠశాలలు 16,173 ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికి 58,754 పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు సంఖ్య 58కు, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 3,902కు, స్థానిక సంస్థలవి 40,495, ఎయిడెడ్ 787, ప్రైవేట్ 13,509కు పడిపోయాయి. మొత్తంగా నాలుగేళ్లలో 4,709 పాఠశాలలు కనుమరుగయ్యాయి.

సంస్కరణలతో సర్కారు బడికి తాళం

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యా విధానం (ఎన్‌ఇపి), అదేవిధంగా అప్పు కోసం ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న సాల్ట్ పథకం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో భారీ సంస్కరణలు తీసుకొచ్చింది. ఈ ప్రభావం పాఠశాలల మూతకు దారి తీసింది. రాష్ట్ర వ్యాప్తంగా 4,234 పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో గత విద్యాసంవత్సరం ప్రభుత్వం విలీనం చేసింది. తరగతులను తరలించడంతో మిగిలిన 1, 2 తరగతుల పిల్లల సంఖ్య తగ్గిపోయింది. కేవలం రెండు తరగతులే అక్కడ ఉండటం, పిల్లల సంఖ్య తక్కువగా ఉండటం, ఉపాధ్యాయుడు ఒక్కడే బోధించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించారు. పిల్లలు లేరని కారణం చూపుతూ ఈ సంవత్సరం 111 ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం మూసివేసింది. జిఒ 117తో ఉపాధ్యాయులను తగ్గించి పిల్లలను బడికి దూరం చేసింది. దీంతో చేరేవారు లేక 500 వరకు మూతపడ్డాయి.

ఎయిడెడ్ నిర్వీర్యం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరితో ఎయిడెడ్ పాఠశాలలు మూతపడ్డాయి. వీటిని ప్రభుత్వానికి అప్పగించాలని, లేదంటే అక్కడ ఉన్న ఉపాధ్యాయులను ప్రభుత్వానికి అప్పగించి సొంతంగానే నడుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీంతో కేవలం తక్కువ సంఖ్యతో మాత్రమే ప్రభుత్వానికి ఆయా యాజమాన్యాలు అప్పగించాయి. మిగిలిన వాటిల్లో చాలామంది పాఠశాలలను నిర్వహించడం లేదు. ఉన్న విద్యార్థులను వేరే పాఠశాలకు పంపి మూతవేశాయి. విజయవాడలో మాంటిస్సోరి పాఠశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. కానీ ఇక్కడ పాఠశాలను నడపకుండా సబ్‌కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాలను నడుపుతోంది. దీంతో అక్కడ ఉన్న విద్యార్థులు కొంతమంది దగ్గర్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లగా, మరికొంత మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 1,400పైగా పాఠశాలలు మూతపడ్డాయి. 2019-20లో 2,234 ఎయిడెడ్ పాఠశాలలు ప్రభుత్వంలో ఉన్నాయి. ఇప్పుడు ఆ సంఖ్య 787కు పడిపోయింది. దీంతో వీటిల్లో చదివే విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. 2019-20 విద్యా సంవత్సరంలో 1,96,750 మంది విద్యార్థులు వీటిల్లో చదవగా, ప్రస్తుత విద్యాసంవత్సరం ఈ సంఖ్య 95 వేలకు పడిపోయింది.

ప్రైవేట్‌పై కరోనా ప్రభావం

కరోనా ప్రభావం చిన్న, మధ్య తరగతి ప్రైవేట్ పాఠశాలలపై తీవ్రంగా పడింది. ఈ సమయంలో పాఠశాలలు నడవకపోవడంతో సిబ్బందికి, నిర్వహణకు పాఠశాలలకు కష్టంగా మారింది. అప్పులు కూడా పుట్టకపోవడంతో 2,600కుపైగా మూసేశారు.

పెరిగిన ఫీజుల భారం

ప్రభుత్వ, ఎయిడెడ్, చిన్న ప్రైవేట్ పాఠశాలలు భారీగా మూతపడటంతో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులను పెంచేశాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులపై చదువుల భారం పెరిగింది. గతంలో ప్రాథమిక స్థాయిలో సుమారు రూ.15 వేలు ఉంది. ప్రస్తుతం ఇది రూ.25 వేలకు పెరిగిందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన ఎన్‌రోల్‌మెంట్

పాఠశాలల మూతతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గింది. కరోనా వల్ల 2020-21, 2021-22 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ బడుల్లో చేరే వారి సంఖ్య బాగా పెరిగింది. ప్రైవేట్ పాఠశాలలు నడవకపోవడంతో ఈ రెండేళ్లల్లో సుమారు 44 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లోనే ఉన్నారు. 2019-20లో ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల్లో చదివిన వారి సంఖ్య 40,15,881. ప్రస్తుతం విద్యాసంవత్సరం ఈ సంఖ్య 38,25000కు పడిపోయింది. అంటే నాలుగేళ్లలో 1,90,881 మంది ప్రభుత్వ విద్యకు దూరమయ్యారు.

మాటతప్పిన ప్రధాని క్షమాపణ చెప్పాలి

ఏలూరులో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

- రాష్ట్రానికి ద్రోహం చేసి తిరుపతి పర్యటనా?
- రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల నిరసనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రత్యేక హోదా, విభజన హామీలు, కృష్ణా జలాల విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహంపై వామపక్ష పార్టీలు ఆదివారం నిరసన తెలిపాయి. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తిరుపతికి ప్రధాని మోడీ రాకను వ్యతిరేకిస్తూ 'మోడీ గోబ్యాక్' అంటూ నినదించాయి. రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాన మంత్రి ఏ ముఖం పెట్టుకొని తిరుపతికి వస్తున్నారంటూ ప్రశ్నించాయి. మాటతప్పిన ప్రధాని క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశాయి. నల్ల చొక్కాలు, బ్యానర్లతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన తిరుపతి జిల్లా రేణిగుంటలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురిని పోలీసులు అరెస్టు చేసి రేణిగుంట స్టేషన్‌కు తరలించారు. నెల్లూరులో సిపిఎం ఆధ్వర్యాన మినీ బైపాస్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం వరకు ర్యాలీ నిరసన నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద వామపక్షాలు నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.ప్రకాష్, వామపక్షాల నాయకులు పాల్గొన్నారు. అనకాపల్లిలో ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదుట సిపిఎం ఆధ్వర్యాన నల్లజెండాలతో నిరసన తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టడంపై, విశాఖ రైల్వేజోన్ అంశంపై ఉత్తరాంధ్ర వాసులను మోసగించడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఏలూరులోని పాతబస్టాండ్ సెంటర్ వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ప్రసంగించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలియజేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో వామపక్షాల ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. సిపిఎం, సిపిఐ జిల్లా మిగతా 2లో

ఎర్నాకులం జనరల్ ఆసుపత్రి

జిల్లా స్థాయి ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి

- దేశంలోనే తొలి రాష్ట్రంగా రికార్డుకెక్కిన కేరళ

కొచ్చి : జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా కేరళ చరిత్ర సృష్టించింది. ఎర్నాకులం జనరల్ ఆసుపత్రిలో ఓ 50 ఏళ్ల తల్లి తన 28 ఏళ్ల కొడుకుకు కిడ్నీ ఇవ్వడానికి ముందుకురావడంతో ఈ అవయవ మార్పిడిని వైద్యులు విజయవంతం గా నిర్వహించారు. తల్లీకొడుకులిద్దరూ క్షేమంగానే ఉన్నారు. ఇటువంటి శస్త్ర చికిత్సకు అవసరమైన అధునాతన వైద్య పరికరాలు, తగిన నిపుణులను జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రులు కలిగి ఉండడం గొప్ప విషయం. ఇది కేరళకే సాధ్యం

వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయిల్ దాడి

- 8 మంది పాలస్తీనీయుల మృతి

గాజా స్ట్రిప్ : కాల్పుల విరమణ, బందీల మార్పిడి ఒకవైపు కొనసాగుతుండగా మరో వైపు వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయిల్ దాడులకు దిగింది. శరణార్థి శిబిరాలను, ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకొని నెతన్యాహూ సైన్యం శని, ఆదివారాల్లో జరిపిన దాడుల్లో 8 మంది పాలస్తీనా పౌరులు చనిపోయారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. జెనిన్ శరణార్థి శిబిరంలో ఐదుగురు చనిపోగా.. సెంట్రల్ వెస్ట్‌బ్యాంక్‌లో ఒకరు, ఇతర ప్రాంతాల్లో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. ఇజ్రాయిల్‌కు చెందిన తండ్రీకొడుకులను కారుతో ఢీకొట్టి చంపిన కేసులో నిందితులను అరెస్టు చేసేందుకు వెళ్లగా..అక్కడివారు తమపై దాడి చేయడంతో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపినట్లు నెతన్యాహూ సైన్యం బుకాయిస్తోంది.

హమాస్ సీనియర్ కమాండర్ మృతి

ఇజ్రాయిల్ జరిపిన మరో దాడిలో తమ సీనియర్ కమాండర్ ఒకరు చనిపోయారని హమాస్ ధ్రువీకరించింది. ఉత్తర గాజా ప్రాంతానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న అహ్మద్ అల్ ఘూందౌర్ అనే బ్రిగేడ్ కమాండర్ ఇజ్రాయిల్ దాడిలో మరణించినట్లు హమాస్ పేర్కొంది. ఆయన ఎప్పుడు, ఎక్కడ మరణించారనే వివరాలు వెల్లడించలేదు. ఈ దాడిలో మరో ముగ్గురు మిలిటరీ నేతలూ చనిపోయిన ట్లు తెలిపింది. ఇజ్రాయెల్‌తో సాగుతున్న యుద్ధంలో ఇప్పటివరకు మతిచెందిన హమాస్ సభ్యుల్లో ఇతడే కీలకమైన వ్యక్తి అని అంతర్జాతీయ వార్తాసంస్థలు పేర్కొన్నాయి. గతంలో ఇజ్రాయెల్ హత్యా ప్రయత్నాల నుంచి మూడుసార్లు తప్పించుకున్నట్లు తెలిపాయి. 2017లో అమెరికా అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది. ఆర్థిక ఆంక్షలూ విధించింది. అంతకుముందు నిరిమ్ మారణకాండకు బాధ్యుడైన బిలాల్ అల్ కేద్రా, హమాస్ ఏరియల్ ఫోర్స్ హెడ్ అబు ముర్రద్, నక్బా యూనిట్ కమాండర్లు అహ్మద్ మౌసా, అమర్ అల్హంది తదితరులను ఇజ్రాయెల్ సైన్యం చంపేసింది.

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

పెద్దల చేతుల్లోని అసైన్డ్ భూములను

పేదలకు ఇవ్వాలి

- రెండున్నర రెట్లు మార్కెట్ రేటు చెల్లిస్తే క్రమబద్ధీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెద్దల చేతుల్లోని అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అర్హులైన అసైన్డ్ లబ్ధిదారులకే యాజమాన్య హక్కులు కల్పించాలని, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల మేరకు భూమిని పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన 'భూముల సమస్యలు - ప్రభుత్వ విధానంపై' ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు పొందిన పేదలకు 20 ఏళ్లు దాటిన వారికి యాజమాన్య హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం చట్ట సవరణ చేసి, పేదలకు యాజమాన్య హక్కులు కల్పిస్తున్నట్లు ఆశ చూపి, జిఓ ఇచ్చిందన్నారు. అనంతరం మార్గదర్శకాల పేరుతో ఎవరు పొజిషన్‌లో ఉంటే వారు మార్కెట్ రేటు కంటే రెండున్నర రెట్లు చెల్లిస్తే వారికి భూ యాజమాన్యపు హక్కులు కల్పిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్లు బ్లాక్‌మనీతో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది ఎకరాలు కొనుగోలు చేశారన్నారు. పదెకరాలు పట్టా భూమి ఉంటే దాని పక్కన ఉండే అసైన్డ్ భూములను కలిపేసుకున్నారని విమర్శించారు. పేదల భూములను కార్పొరేట్లు, భూస్వాములు, పెత్తందార్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ రంగం సిద్ధం చేసిందన్నారు. రానున్న కాలంలో అసైన్డ్ చట్ట సవరణలపై అన్ని రాజకీయ పార్టీలూ తమ వైఖరి వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. పేదలకు అండగా రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్ భూముల సమస్యను ప్రధాన అజెండాగా మార్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వామపక్ష పార్టీల ప్రజా ఉద్యమాల ఫలితంగా రాష్ట్రంలో అసైన్డ్ భూముల పంపిణీ జరిగిందన్నారు. పరిశ్రమల పేరుతో వందలాది ఎకరాలు కార్పొరేట్లకు ప్రభుత్వాలు భూములు కేటాయిస్తుందని, ఆయా భూముల్లో ఒక్క పరిశ్రమ కూడా పెట్టకపోగా ఆయా కంపెనీల యాజమాన్యాలు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుంటున్నాయన్నారు. కార్పొరేట్ల కంపెనీలు రాష్ట్రంలో రూ.లక్ష కోట్లు బ్యాంకులకు ఎగనామం పెట్టాయని ఆయన పేర్కొన్నారు. పేదలకు అండగా అసైన్డ్ భూముల పరిరక్షణ కోసం వ్యవసాయ కార్మిక మిగతా 2లో

గ్రీస్ తీరంలో మునిగిన కార్గో నౌక

- నలుగురు భారతీయులు సహా 13 మంది గల్లంతు

ఏథెన్స్ : గ్రీస్ తీరంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సముద్రంలో బలమైన గాలుల కారణంగా అల్లకల్లోల పరిస్థితుల్లో కార్గో నౌక మునిగిపోవడంతో 13 మంది గల్లంతయ్యారు. వీరిలో నలుగురు భారతీయులున్నారు. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 14 మంది సిబ్బంది ఉన్నట్లు తెలిసింది. వీరిలో ఒకరిని సహాయక సిబ్బంది రక్షించారు. మిగిలిన 13 మంది కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈజిప్టులోని అలెగ్జాండ్రియా నుంచి రాప్టర్ అనే కార్గో నౌక.. ఆరు వేల టన్నుల ఉప్పుతో తుర్కియే లోని ఇస్తాంబుల్ బయలుదేరింది. మార్గం మధ్య లో ఆదివారం ఉదయం ఏడు గంటలకు నౌకలో సాంకేతిక సమస్య తలెత్తిన విషయాన్ని గుర్తించిన సిబ్బంది వెంటనే సమీప కేంద్రానికి ప్రమాద సంకేతాన్ని పంపించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆ నౌక కనిపించకుండా పోయినట్లు స్థానిక కోస్ట్ గార్డ్ వెల్లడించింది. రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు ముమ్మర గాలింపు మొదలుపెట్టాయి.

భూ విక్రయంలో మోసం

- మనస్తాపంతో యువ వైద్యుడు ఆత్మహత్య
- ఎంఎల్‌ఎ కన్నబాబు సోదరుడే కారణమన్న మృతుని తల్లి

ప్రజాశక్తి- కాకినాడ

భూమి విక్రయంలో తనను మోసగించారనే మనస్తాపంతో కాకినాడలో ఒక యువ వైద్యుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఎంఎల్‌ఎ కన్నబాబు సోదరుడు కల్యాణ్ కృష్ణ వల్లే తన కుమారుడు బలవన్మరణానికి పాల్పడినట్లు మృతుని తల్లి ఆరోపించారు. వైద్యుని తల్లి కథనం ప్రకారం... కాకినాడలోని అశోక్ నగర్ గోకులం సమీపంలో డాక్టర్ నున్న కిరణ్ చౌదరి తన తల్లి శేషారత్నంతో కలిసి నివసిస్తున్నారు. రష్యాలో వైద్య విద్య అభ్యసించిన కిరణ్ అవివాహితులు. ఆయన జిజిహెచ్‌లో మార్చురీ విభాగంలో పని చేస్తున్నారు. శనివారం రాత్రి తన ఇంట్లో పురుగు మందుతాగి విగతజీవిగా పడిపోయారు. దీన్ని తల్లి గమనించి ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. గొల్లప్రోలు మండలం చందుర్తి, కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం కోరాడ గ్రామంలో ఉన్న సుమారు 12.50 ఎకరాల భూమిని కిరణ్ అమ్మకానికి పెట్టారు. సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన పెదబాబుకు ఈ భూమికి సంబంధించిన దస్తావేజులు అప్పగించారు. ఆ తర్వాత వారు డబ్బులు చెల్లించకుండా ఎదురు తిరగడంతో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ వ్యవహారంలో కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ సోదరుడు కల్యాణ కృష్ణ పాత్ర కీలకంగా ఉందని కిరణ్ తల్లి ఆరోపించారు. ఇప్పటికే భూ విక్రయాల్లో ఎంఎల్‌ఎ కన్నబాబు ప్రధాన అనుచరుడు గాలిదేవర బాలాజీ కూడా కూరాడ భూమి విక్రయానికి సంబంధించి డబ్బులు ఇవ్వకుండా తన కుమారుడిని ఇబ్బందులకు గురి చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుని మృతికి కారణమైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగు మందు డబ్బాతో తల్లి శేషారత్నం (ఇన్‌సెట్‌లో) కిరణ్ చౌదరి (ఫైల్)

పేదలకు అందని రాజ్యాంగ ఫలాలు

- అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిఆర్ అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగ ఫలాలు రాష్ట్రంలో పేదలకు అందడం లేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి అచ్చెన్నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదలపై జగన్ తన దమనకాండను కొనసాగిస్తున్నారని విమర్శించారు. వైసిపి పాలనలో 28 మంది ఎస్‌సిలను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేల ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. రాజ్యాంగానికి రాష్ట్రంలో విలువ లేదనిపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను జగన్ రద్దు చేస్తున్నారని టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు విమర్శించారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి పీతల సుజాత విమర్శించారు. రాజ్యాంగం లేని రోజుల్లో దళితులపై జరిగిన దాడులు జగన్ పాలనలో జరుగుతున్నాయని అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు అఖిల్, జి కోటేశ్వరరావు, ఎస్‌టి సెల్ అధ్యక్షులు ధారునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అమలు చేస్తున్నది రాజారెడ్డి రాజ్యాంగం : లోకేష్ విమర్శ

జగన్‌కు రాజ్యాంగ దినోత్సవం జరుపుకునే హక్కు లేదని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ధిక్కరించి తన తాత రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో రాజ్యాంగ హక్కులకు దిక్కులేదని, నిలదీస్తే నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. సర్కారు అవినీతి, అరాచకాలను ప్రశ్నిస్తే ప్రాణాలు తీసిన జగన్ ఆటవిక పాలనను అంతమొందించేందుకు ప్రజలు ఉద్యమించాలన్నారు. జగన్ నేర క్రూర పాలనకు బలైన వారికి కన్నీటి నివాళ్లని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి, అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తున్న మహానుభావులు, ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు అని తెలిపారు.

ఆర్‌జియుకెటిలో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రవీణ్ కుమార్ (ఫైల్)

నిర్మల్ జిల్లా బాసర ఆర్‌జియుకెటి యూనివర్సిటీలో ఆదివారం విద్యార్థి ఆత్మహత్య కలకలం రేపింది. ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లా తౌడకుర్తి గ్రామానికి చెందిన రామటి ప్రవీణ్ కుమార్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 30న ఎన్నికల నేపథ్యంలో యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు సెలవులు మంజూరు చేసి అవుట్ పాసులను అందిస్తున్నారు. ప్రవీణ్ కుమార్, అతని స్నేహితులు కూడా అవుట్ పాస్ కోసం దరఖాస్తు చేసుకున్నట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ప్రవీణ్ కుమార్ స్నేహితుడు అవుట్ పాస్ తీసుకొని బయటకు వెళ్లి పోయాడు. కానీ ఎంతసేపైనా ప్రవీణ్ బయటకు రాకపోవడం.. ఫోన్ చేసినా స్పందించపోవడంతో అతని స్నేహితుడు యూనివర్సిటీ అధికారులకు సమాచారం అందించాడు. దీంతో వర్సిటీ పరిసరాలలో గాలించినా ఆచూకీ లభించలేదు. చివరకు బిహెచ్ టు ఖాళీ గదిలో విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న గదికి తాళాలు వేయకుండా ఖాళీగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడి తల్లి మూడు నెలల కిందటే చనిపోయారు. తండ్రి ఇటీవలే మరో వివాహం చేసుకోవడంతో ప్రవీణ్ మానసికంగా కుంగిపోయారు. ఈ విషయంపై బంధువులకు చెప్పి బాధపడినట్టు సమాచారం. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు దర్యాప్తులో ఉంది.

ఎర్రబెల్లి ప్రచార రథంపై నుంచి పడి బాలిక మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తంజలి ఫైల్‌ఫోటో

బిఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎన్నికల ప్రచారంలో విషాద ఘటన జరిగింది. వరంగల్ జిల్లా కొడకండ్ల మండలంలోని నిలువండతండాలో ప్రచారం సమయంలో గ్రామానికి చెందిన గుగులోతు తంజలి (9) ప్రచార రథంపై నుంచి కింద పడి మృతిచెందింది. ఇందుకు సంబంధించి తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంత్రి ఎర్రబెల్లి ప్రచార రథం గ్రామానికొచ్చింది. అక్కడ డిజె పెట్టి కార్యకర్తలు డ్యాన్స్ చేస్తుండగా.. రథం ముందుకు కదులుతూ వెళ్తోంది. ఈ క్రమంలో రథంపై ఉన్న తంజలి ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్ర గాయాల య్యాయి. వెంటనే ఆమెను కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తండావాసులు కోరారు.

విప్లవచరిత్రను మరవొద్దు

రోడ్ షోలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

- సాయుధపోరాట స్ఫూర్తితో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి
- ప్రజలకు సీతారాం ఏచూరి పిలుపు
- యాదాద్రి-భువనగిరిలో భారీ రోడ్ షో

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సాయుధ తెలంగాణ పోరాట స్ఫూర్తితో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విప్లవ చరిత్రను మరవొద్దని అన్నారు. 'రజకార్లకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర మనది. మరోసారి ఆ తెగువ ప్రదర్శించాలి. అసెంబ్లీకి ఎర్రజెండా అభ్యర్థులను పంపాలి' అని పిలుపునిచ్చారు. సిపిఎం అభ్యర్థులకు ఓటేస్తే మీకు మీరు ఓటేసుకున్నట్లని అన్నారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాయుధ పోరాటం అనంతరం పది వేల ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర మన గడ్డకు ఉందని గుర్తు చేశారు. భూ సంస్కరణలకు మూలం తెలంగాణ సాయుధ పోరాటమని స్పష్టం చేశారు. యాదాద్రి-భువనగిరి జిల్లా కేంద్రంలో భువనగిరి, మునుగోడు, నకిరేకల్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం భారీ రోడ్ షో నిర్వహించారు. దీనికి ఆయా నియోజకవర్గాల నుంచి వేలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ అప్పటి ఎన్నికల్లో పోటీ చేసిన కమ్యూనిస్ట్ నేత రావి నారాయణరెడ్డికి భారత తొలి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ ఓట్లు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను శాసనసభలో సమగ్రంగా చర్చించే సత్తా సిపిఎం అభ్యర్థులకే ఉంటుందన్నారు. అసెంబ్లీలో సిపిఎం ఎమ్మెల్యేలు లేనిలోటు ఇటీవల సమావేశాలను పరిశీలిస్తే స్పష్టంగా కనిపిస్తోందని వివరించారు. బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ రాజకీయాలను వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు. ఆ పార్టీలు, వారి నాయకులు ప్రజాసేవ చేస్తున్నారా? సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. గత పదేళ్లలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు 16 లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేసిందని, ఇదంతా ప్రజల సొమ్మని గుర్తు చేశారు. రైతుల రుణాలు మాత్రం మాఫీ చేయలేదని విమర్శించారు. ఒక్క శాతంగా ఉన్న ధనికుల కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. దేశంలో 70 శాతం యువజనులకు ఉపాధి లేకపోవడం అత్యంత దారుణమన్నారు. ఎన్నికలు రాగానే గ్యాస్ ధర గుర్తొంచిందా? రూ.400 ఉన్న ధరను రూ.1000కి పెంచి, ఎన్నికలు దగ్గరకు రాగానే రూ.200 తగ్గిస్తే సరిపోతుందా? అంటూ మోడీ సర్కారును ప్రశ్నించారు.

త్యాగాలు చేసిన వారిని అసెంబ్లీకి పంపాలి : చెరుపల్లి సీతారాములు

ప్రజాసమస్యలపై పోరాడిన వారిని, త్యాగాలు చేసిన వారిని చట్టసభలకు పంపాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు కోరారు. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ప్రజలను పట్టించుకోకుండా తమ ఆస్తులను పెంచుకుంటున్నారన్నారు. ఓట్లు కొనుక్కోవడానికి వచ్చే అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన బహిరంగ సభకు సిపిఎం యాదాద్రి-భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అధ్యక్షత వహించారు. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొండమడుగు నర్సింహ, మునుగోడు అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి, నకిరేకల్ అభ్యర్థి బొజ్జ చినవెంకులు ప్రసంగించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఆశయ్య, రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, ఆనగంటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి ఎరుపుమయం

సీతారాం ఏచూరి రోడ్‌షోకు వేలాది మంది తరలివచ్చారు. ప్లకార్డులు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఎర్ర జెండాలతో భువనగిరి జిల్లా కేంద్రం అరుణారుణవర్ణమైంది. యువత, మహిళలు, విద్యార్థులు, పిల్లలు, వృద్ధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. డప్పు, కోలాటాల బృందాలు పదం పాడుతూ కదం తొక్కుతూ ముందుకు నడిచాయి.

రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు నివాళి

- వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడమే అంబేద్కర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్మితమవుతున్న అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించి నివాళు లర్పించారు. పనులను పరిశీలించి అక్కడి ఉన్న అధికారులతో చర్చించారు. స్వరాజ్య మైదానంలో 125 అడుగుల విగ్రహం నిర్మాణం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగాన్ని జాతికి అంకితం చేసిన రోజు నవంబరు 26 అని చెప్పారు. దేశానికి పునాదిగా ఉన్న రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. దళితులు, ఆదివాసీలు వంటి అన్ని తరగతుల భవిష్యత్తు దాని పరిరక్షణపైనే ఆధారపడి ఉంటుందన్నారు. వీలైనంత త్వరగా అంబేద్కర్ పార్కును రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసి జాతికి అంకితం చేయాలని కోరారు.కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. దేశంలో అంబేద్కర్‌కు ప్రాధాన్యత ఉందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారతదేశంలో ఉందని, ఈ వ్యవస్థ పోవాలని అంబేద్కర్ కోరుకున్నారని చెప్పారు. అంబేద్కర్ జపం చేస్తున్న మనువాద మతోన్మాదులు కుల వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఇప్పటికీ కులం పేరుతో దుర్మార్గాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, సహాయ కార్యదర్శి జి క్రాంతికిరణ్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విజయవాడలో నిర్మితమవుతున్న అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వి శ్రీనివాసరావు తదితరులు

వనరులన్నీ కెసిఆర్ కుటుంబం చేతిలోనే!

- తొలి కేబినేట్‌లోనే ఆరు గ్యారెంటీల అమలుపై సంతకం
- ఆందోల్, సంగారెడ్డి, కామారెడ్డి సభల్లో రాహుల్ గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో వనరులన్నీ సిఎం కెసిఆర్ కుటుంబం చేతుల్లోకి వెళ్లిపోయాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఎనిమిది వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఆందోల్‌లో కాంగ్రెస్ నిర్వహించిన విజయభేరి సభలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఆదాయమంతటినీ కెసిఆర్ కుటుంబం దోచుకుంటోందని ఆరోపించారు. ల్యాండ్, సాండ్, మైన్స్, వైన్స్ అంతా కెసిఆర్ కుటుంబం చేతిలోనే ఉందని చెప్పారు. ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకుని పేదల భూములను గుంజుకున్నారని తెలిపారు. పరీక్ష పేపర్ల లీక్ వల్ల ఎంతో మంది యువత నష్టపోయారని, కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులకు న్యాయం చేస్తామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఈ పదేళ్లలో బిఆర్ఎస్ ఏం చేసిందో కెసిఆర్ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దొరల సర్కార్‌కు, ప్రజల సర్కార్‌కు మధ్య తేడా ఏంటో మేం చెప్తున్నాం, చూపిస్తామని తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేసి ప్రజా పాలనను చూపిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తొలి కేబినెట్ సమావేశంలో ఆరు గ్యారంటీల అమలుపై సంతకం హామీ ఇచ్చారు.. "ప్రధాని మోడీ నాపై 24 కేసులు పెట్టారు. నా ఎంపి సభ్యత్వం రద్దు చేసి ఎంపిల క్వార్టర్స్ నుంచి పంపించి వేశారు. అవినీతిపరుడైన కెసిఆర్‌పై మాత్రం ఒక్క కేసూ లేదు. బిఆర్ఎస్, బిజెపి మధ్య మంచి స్నేహం ఉంది. ఢిల్లీలో మోడీకి కెసిఆర్ సహకరిస్తారు, తెలంగాణలో కెసిఆర్‌కు మోడీ సాయం చేస్తారు. రాష్ట్రంలో కెసిఆర్ తన కుటుంబానికి మాత్రమే మేలు చేసుకుంటారు" అని రాహుల్‌గాంధీ విమర్శించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటువేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాహుల్ గాంధీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ప్రచార సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

పెద్దల చేతుల్లోని అసైన్డ్ భూములను పేదలకు ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

సంఘం చేసే ఉద్యమానికి సిపిఎం ప్రత్యక్షంగా మద్దతు ఇస్తుందని శ్రీనివాసరావు ప్రకటించారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. అసైన్డ్‌దారుల విన్నపాలు స్వీకరించకుండా ఏకపక్షంగా భూస్వాములకు మేలు చేసేందుకు క్రమబద్ధీకరణ పేరుతో భూస్వాముల ప్రయోజనాలను కాపాడేందుకు నిర్ణయం తీసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. భూస్వాముల ఆధీనంలోని భూమిని పేదలకు పంచాలని, అసైన్డ్ భూములను తిరిగి హక్కుదారులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో అసైన్డ్ భూములను పొందిన వారి జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రకటిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ఇంత వరకు ఏ గ్రామ, వార్డు సచివాలయంలో జాబితాను బహిర్గత పరచలేదన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల మేరకు అర్హులందరికీ భూ పంపిణీ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేస్తుందన్నారు. 9/77 అసైన్డ్ చట్ట సవరణ సందర్భంగా నిజమైన అసైన్డ్‌దారులకే హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) నాయకులు కె పోలారి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు హరనాథ్, ఎంసిపిఐ (యు) నాయకులు కెస్‌కె ఖాదర్ బాషా, ఏజేస్, ఎపిడికెఎస్ నాయకులు క్రాంతికుమార్, ఎపిరైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ, ఎపి కౌలు రైతు సంఘం కార్యదర్శి హరిబాబు, బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, డిబిఎఫ్ అఖిల భారత నాయకులు కొరివి వినయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్‌కు విశ్రాంతి ఇవ్వండి

- గజ్వేల్‌లో ఓడిపోతాననే మరోచోటకు కెసిఆర్
- తూప్రాన్, నిర్మల్ విజయ సంకల్ప సభల్లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం పట్టని ముఖ్యమంత్రి కెసిఆర్‌కి విశ్రాంతి ఇద్దాం.. లిక్కర్ కుటుంబాన్ని జైలుకు పంపుదాం" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్, నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విజయ సంకల్ప సభల్లో మోడీ ప్రసంగించారు. 'ప్రజలకు అందుబాటులో ఉండరు.. ప్రగతి భవన్, ఫాంహౌజ్‌కు పరిమితమైన ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రానికి అవసరం లేదు. ఆయన సేవలకు సెలవు ఇద్దాం. పదేళ్లలో కెసిఆర్ కనీసం సచివాలయానికి కూడా వెళ్లలేదు' అని మోడీ విమర్శించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. సోనియాగాంధీ, కెసిఆర్ కుటుంబాల స్కాములపై విచారణ జరుగుతోందని తెలిపారు. మొబైల్ ఫోన్ మార్చినంత మాత్రాన మోసాలు బయటకు రాకుండా ఉండవన్నారు. కొందరు బెయిల్‌పై బయట తిరుగుతున్నారని, బిజెపి ప్రభుత్వం రాగానే వారిని జైలుకు పంపడం గ్యారంటీ అని అన్నారు. గజ్వేల్‌లో బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌పై ఓడిపోతాననే కెసిఆర్ మరో నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బిజెపి అభ్యర్థులు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, నందీశ్వర్‌గౌడ్, మురళీదర్‌యాదవ్, పంజా విజయ్‌కుమార్, రాజు ముదిరాజ్, దేవి శ్రీకాంత్‌రెడ్డి తూప్రాన్ సభలో పాల్గొన్నారు.

ధరణి పేరుతో బిఆర్ఎస్ భూ మాఫియా

తెలంగాణ ప్రభుత్వం పేదల భూములు లాక్కొనేందుకే ధరణి తీసుకొచ్చి భూ మాఫియాకు పాల్పడుతోందని,తెలంగాణలో వేల కోట్ల రూపాయల సాగునీటి కుంభకోణం జరిగిందని ప్రధాని ఆరోపించారు. కాంగ్రెస్ సుల్తాను పాలన సాగిస్తే.. బిఆర్ఎస్ నిజాం పాలనను తలపిస్తోందని విమర్శించారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నామని హామీ ఇచ్చారు. బిజెపి అధికారంలోకి రాగానే పెట్రోల్ ధరలు తగ్గిస్తామని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణకు కమిటీ వేశామన్నారు. 2024లోనూ కేంద్రంలో తమ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మహాధర్నా ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఉమామహేశ్వరరావు, కేశవరావు తదితరులు

నేటి మహాధర్నాకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరగనున్న మహాధర్నాకు సర్వం సిద్ధమైంది. విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో సోమ, మంగళవారాల్లో జరగనున్న ధర్నాను జయప్రదం చేసేందుకు అన్ని ఏర్పాట్లనూ నాయకులు పూర్తి చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులకు నగరంలో కందుకూరి కల్యాణ మండపం, ఛాంబర్ ఆఫ్ ఫిలిమ్స్, చాంబర్ ఆఫ్ కామర్స్, శ్రీరామ ఫంక్షన్ హాలు, ఉమ్మడి కృష్ణా జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ హాల్‌లో వసతులు ఏర్పాటుచేశారు. ఈ ధర్నాకు వివిధ రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు, ప్రముఖులు హాజరవుతారని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆదివారం విలేకరులతో చెప్పారు. ధర్నా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ మహాధర్నాతో కేంద్ర ప్రభుత్వం దిగిరావాలని, రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఈ వేదిక ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేయబోతున్నామని తెలిపారు. లేదంటే తగిన రీతిలో భవిష్యత్తులో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఆయనతోపాటు రైతు, కార్మిక సంఘాల నాయకులు వి ఉమామహేశ్వరరావు, వై కేశవరావు, కె ధనలక్ష్మి, కె ఉమామహేశ్వరరావు, వి కృష్ణయ్య, జి ఓబులేసు, ఎం సాంబశివరావు, నరేంద్ర, దడాల సుబ్బారావు తదితరులు ఉన్నారు.

దీక్షా శిబిరంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు, కార్మికులు

తెలంగాణ ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ దేశాభివృద్ధికి విఘాతం కలిగిస్తోన్న బిజెపికి తెలంగాణ ఎన్నికల్లో ఆ రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1018వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ వైఎస్ఆర్‌టియుసికి చెందిన కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. తొలుత దీక్షా శిబిరంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, సిఐటియు నాయకులు శ్రీనివాసరాజు, పోరాట కమిటీ ప్రతినిధులు వరసాల శ్రీనివాసరావు, సిహెచ్.సన్యాసిరావు, పిట్టా రెడ్డి, న్యాయవాది జనార్ధనరావు మాట్లాడారు. రాజ్యాంగ విశిష్టతను తెలియజేశారు. మతతత్వ బిజెపి పాలనలో దేశంలో ఘర్షణలు, దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. దక్షిణాదిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేసేందుకు బిజెపి దూకుడుగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల పోరాటాలు, ప్రాణ త్యాగాలతో విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పడిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. దీన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో నాయకులు కర్రి దాలి నాయుడు, బోర శశిభూషణరావు, సంజీవరెడ్డి, గొంతున వెంకటలక్ష్మి, బైరెడ్డి అప్పలరెడ్డి, అప్పలకొండ, రమేష్, పోలి నాయుడు పాల్గొన్నారు.

ఒఆర్‌ఆర్‌పై కారు దగ్ధం

- వ్యక్తి సజీవ దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓఆర్‌ఆర్‌పై ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగి వ్యక్తి సజీవ దహనమయ్యారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. ఆదిభట్ల సిఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన బడుగుల వెంకటేష్ (25) కారులో హైదరాబాద్‌కు వస్తున్నారు. ఆదిభట్ల శ్రీ శ్రీ ఏరోసిటీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఎగ్జిట్ నెం.12 అండ్ 13 మధ్య ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దాంతో కారులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి రావడంతో పాటు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహనం మంటలను అదుపు చేసింది. అప్పటికే కారులో ఉన్న వెంకటేష్ పూర్తిగా కాలిపోయారు. క్లూస్ టీం ద్వారా పోలీసులు సమాచారం సేకరించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.. లేక ఎవరైనా చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు.

మాటతప్పిన ప్రధాని క్షమాపణ చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శులు బి.బలరాం, కోణాల భీమారావు పాల్గొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో సిపిఎం ఆధ్వర్యాన నల్ల జెండాలతోనూ, కాకినాడలో వామపక్షాల ఆధ్వర్యాన నల్ల బెలూన్లతోనూ నిరసన తెలిపారు.

విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన...

ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ... తిరుపతి పర్యటనను వ్యతిరేకిస్తూ విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. నల్లబెలూన్లు ఎగుర వేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.కృష్ణ, సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎస్‌కె నిజాముద్దీన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

తిరుమలలో ప్రధాని మోడీ

(మొదటిపేజీ తరువాయి)

మిథున్ రెడ్డి, డాక్టర్ గురుమూర్తి, రెడ్డెప్ప, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు.

సిపిఎం, సిపిఐ నాయకుల అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు

ప్రధాని తిరుమలకు వస్తున్న సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే పోలీసులు పలువురు సిపిఎం, సిపిఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు. పలువురిని గృహ నిర్బంధంలో ఉంచారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజును హౌస్ అరెస్ట్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి వెంట షాడో పార్టీని ఏర్పాటు చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర, జిల్లా అధ్యక్షులు ఎం.నరేంద్ర తదితరులను సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్బంధించారు. తిరుచానూరులో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుమన్‌ను, అలిపిరిలో ఆర్.లక్ష్మిని గృహనిర్బంధంలో ఉంచారు. వెంకటగిరిలో చెంగయ్యను, పుత్తూరులో వెంకటేశును, బుచ్చినాయుడు కండ్రిగలో సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్యను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

సిపిఎం ఖండన

సిపిఎం, సిపిఐ తదితర వామపక్ష నాయకుల అక్రమ నిర్బంధాన్ని, అరెస్టులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. న్యాయం కోసం ప్రజల తరుపున పోరాడుతున్న వారిని గృహనిర్బంధాలు, అరెస్టులు చేసి నిరసనలను అణచివేయడం గర్హనీయమని పేర్కొన్నారు. నిర్బంధాలకు స్వస్తి చెప్పి రాష్ట్ర హక్కుల కోసం పోరాడేందుకు ముందుకు రావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజ్యాంగానిదే ప్రధాన పాత్ర

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అణగారిన తరగతులను ముందుకు తీసుకురావడంలో రాజ్యాంగం ప్రధాన పాత్ర వహించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అభిప్రాయపడ్డారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. అంబేద్కర్ రాజ్యాంగంలో ఏవైతే సూచించారో వాటిని తూచా తప్పకుండా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్ రాజ్యాంగం దేశంలోని అన్ని తరగతులకూ సమాన హక్కులు, అవకాశాలను కల్పించిందన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉద్యోగోన్నతులపై స్పష్టతనివ్వాలి

- ఎపి గ్రామ సర్వేయర్ల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ సర్వేయర్ల ఉద్యోగోన్నతులపై ప్రభుత్వం తగిన స్పష్టత ఇవ్వాలని, రీ సర్వే విధుల్లో ఉన్న సర్వే సిబ్బందికి రవాణా భత్యంతోపాటు రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై విజయవాడలోని ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ.. సర్వేయర్లు తీవ్ర పని ఒత్తిడితో విధి నిర్వహణలోనే అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అందువల్ల వారికి ఉపశమనం కల్పించేందుకు క్రీడలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పలువురు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

విఆర్‌ఓపై దాడి చేసిన వారిపై చర్యలు

- భూపతిరాజు రవీంద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చెముడుగుంట సచివాలయ విఆర్‌ఓ జుబేర్ అహమ్మద్‌పై వైసిపి కార్యకర్త నితీష్ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విఆర్‌ఓల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రాష్ట్రంలో కొందరు వ్యక్తులు ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

12 నుంచి తపాలా ఉద్యోగుల సమ్మె

- కమలేష్ చంద్ర సిఫార్సులు అమలు చేయాలి
- ఎఐజిడిఎస్‌యు జాతీయ ప్రధాన కార్యదర్శి మహదేవయ్య
- ఉద్యోగుల పోరాటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు సంఘీభావం

మాట్లాడుతున్న ఎఐజిడిఎస్‌యు జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.మహదేవయ్య

ప్రజాశక్తి-వన్‌టౌన్ (విజయవాడ)

చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ డిసెంబర్ 12 నుంచి తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగాలని నిర్ణయించినట్లు ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఎఐజిడిఎస్‌యు) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.మహదేవయ్య తెలిపారు. డిసెంబరు 4 నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో తపాలా ఉద్యోగుల సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాలని, కమలేషన్ చంద్ర కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. యూనియన్ ఎపి సర్కిల్ సర్వసభ్య సమావేశం, నిరవధిక సమ్మెపై అవగాహనా సదస్సు ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ వన్‌టౌన్‌లోని తపాలా ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో మహదేవయ్య మాట్లాడుతూ గ్రామీణ డాక్స్ సేవకులకు ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12, 24, 36 అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేకసార్లు ఉద్యమాలు చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 28న పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రాలు అందజేసి తమ సమస్యను పార్లమెంట్ దృష్టికి తీసుకురావాలని కోరతామన్నారు. డిసెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు డివిజన్ స్థాయిలో సభ్యులకు అవగాహన కలిగించి సమ్మెకు సిద్ధం చేస్తామని తెలిపారు. 11న అన్ని సర్కిళ్ల పరిధిలోని ఉప, ప్రధాన తపాలా కార్యాలయాల ఎదుట భోజన విరామ సమయంలో నిరసనలు తెలుపుతామని చెప్పారు. డిసెంబరు 12 నుంచి శాంతియుతంగా నిరధిక సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలను కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గ్రామీణ డాక్ సేవకులు బలమైన యంత్రాంగంగా ఉందని, దీనిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 7వ వేతన కమిటీలో న్యాయమైన హక్కులను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపాలా ఉద్యోగులకు సిపిఎం తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ఖనిజాలు లాంటి ప్రధాన రంగాలను ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తే సామాన్య ప్రజలకు ఎలాంటి హక్కులూ ఉండవన్నారు. కేంద్రం దిగివచ్చి తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బిసివై పార్టీ రాష్ట్ర కార్యదర్శి అనూష్, ఎపి నిరుద్యోగ జెఎసి కన్వీనర్ పవన్‌కుమార్, సర్కిల్ కార్యదర్శి వై.మర్రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి తపాలా ఉద్యోగులు, గ్రామీణ డాక్ సేవకులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించొద్దు

- ఎపి రైతు సంఘం

మీటరు బిగించిన ప్రదేశంలో రైతులతో మాట్లాడుతున్న రాజశేఖర్

ప్రజాశక్తి - గడివేముల (నంద్యాలజిల్లా)

నంద్యాల జిల్లా గడివేములలో గత వారం రోజులుగా రైతులకు తెలియకుండా, రైతుల అభిప్రాయ సేకరణ లేకుండా రాత్రికి రాత్రే వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం దారుణమని ఎపి రైతు సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడివేముల మండల కేంద్రంలోని పొలాల్లో బిగించిన మీటర్లను రైతు సంఘం నేతలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ రైతులతో మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులు రాత్రికి రాత్రే దొంగల్లాగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం దారుణమన్నారు. సకాలంలో వర్షాలు పడక, ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఇబ్బంది పడుతున్న సమయంలో మీటర్లు బిగించి రైతుల నడ్డి విరుస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ షరతులకు తలొగ్గి వైసిపి ప్రభుత్వం మోటార్లకు మీటర్లు పెట్టి రైతుల మెడకు ఉరి బిగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ మోటార్లకు బిగించిన మీటర్లను తొలగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున రైతులతో తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. త్వరలో విజయవాడలో రైతులతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద స్వామి, గోకారి, మహిళా రైతులు కూలీలు పాల్గొన్నారు.

వరి పంటపై ఏనుగుల దాడి

- వ్యవసాయ బోరు పరికరాలు ధ్వంసం

ప్రజాశక్తి- సోమల (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా సోమల మండలంలోని పేటూరు గ్రామానికి చెందిన చిట్టి అనే రైతుకు చెందిన వరి పంటను ఏనుగులు తొక్కి ధ్వంసం చేశాయి. కనిగలచెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు శనివారం అర్ధరాత్రి సమయంలో చిట్టి అనే రైతుకు చెందిన రెండు ఎకరాల వరి పొలాన్ని తొక్కి ధ్వంసం చేశాయి. దీంతో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పండించిన పంట చేతికందే సమయంలో ఏనుగులు తొక్కి నాశనం చేయడంతో పంటనష్టం, అప్పులే మిగిలాయని వాపోయారు. వ్యవసాయ బోరు మోటారు, పరికరాలను కూడా ధ్వంసం చేశాయని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరారు. ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయని, అటవీశాఖ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తరచూ ఏనుగుల రావడం పంటలు, గ్రామాలపై దాడులు చేయడం పరిపాటిగా మారిందని, పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోందని, ఇప్పటికైనా ఏనుగులు గ్రామాల్లోకి రావడాన్ని నివారించాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

పోరాడే శక్తులనే గెలిపించండి

- సిపిఎం బైక్‌ర్యాలీలో మాజీ ఎంపి పి మధు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడే శక్తులనే గెలిపించాలని రాజ్యసభ మాజీ సభ్యులు పి మధు అన్నారు. ముషీరాబాద్ సిపిఎం అభ్యర్థి ఎం దశరథ్ గెలుపును కాంక్షిస్తూ ఆదివారం భారీ బైక్‌ర్యాలీ జరిగింది. ర్యాలీ అనంతరం సిపిఎం నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో మధు మాట్లాడుతూ.. ప్రజల క్షేమం కోసం నిరంతరం పోరాడేది మార్క్సిస్టు పార్టీయేనని తెలిపారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవకాశవాదం, ఒంటెత్తుపోకడతో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దీన్ని ప్రజలు ఆమోదించరన్నారు. బిజెపి మతోన్మాదంతోపాటు ప్రభుత్వ రంగాన్ని ప్రయివేట్ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ గొప్పలకు పోయిన మోడీ.. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గవర్నర్ల వ్యవహార శైలిపై సుప్రీం కోర్టు చివాట్లు పెట్టిందని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం బిజెపితో మిలాఖత్ కావడమేంటని నిలదీశారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి దశరథ్‌తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణజ్యోతి, నగర పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్, ఎం.మహేందర్,రాజన్న,ఎం వెంకటేశ్, నాగలక్ష్మి తదితర నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి యువగళం పాదయాత్ర

- పొదలాడకు చేరుకున్న లోకేష్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎయిర్‌పోర్టులో లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర అంబేద్కర్ కోనసీమ జిల్లా పొదలాడ నుంచి సోమవారం ప్రారంభం కానుంది. పాదయాత్రకు తాత్కాలిక విరామం ప్రకటించిన పొదలాడ నుంచే ప్రాదయాత్రను పున:ప్రారంభించనున్నారు. స్కిల్ స్కామ్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబును సెప్టెంబర్ 9న పోలీసులు అరెస్టు చేయడంతో.. పాదయాత్రకు లోకేష్ తాత్కాలికంగా విరామం ప్రకటించారు. చంద్రబాబుకు బెయిల్ లభించడంతో పాదయాత్రను కొనసాగించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో లోకేష్ హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాజమండ్రి, రాజోలు మీదుగా పొదలాడకు చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద లోకేష్‌కు అభిమానులు, కార్యకర్తలు పూలమాలలతో స్వాగతం పలికారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

వెంకన్న సాక్షిగా మాట తప్పిన ప్రధాని మోడీ

- పిసిసి అధ్యక్షులు రుద్రరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి వెంకటేశ్వరస్వామి సాక్షిగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇచ్చిన మాటను ప్రధాన మంత్రి మోడీ తప్పి అన్యాయం చేశారని పిసిసి అధ్యక్షులు గిడుగు విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధాని మోడీ తిరుపతి పర్యటన సందర్భంగా గత దశాబ్ద కాలంగా ఎపికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ.. రుద్రరాజు బహిరంగ లేఖను విడుదల చేశారు. 2014లో ప్రధాని అభ్యర్థిగా తిరుపతికి వచ్చిన మోడీ బిజెపి అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదా, రైల్వేజోన్, కేంద్ర విద్యా సంస్థలు, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంతోపాటు రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖర్ తరహా ప్రత్యేక నిధులతో కూడిన ప్యాకేజీ, విభజన చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు.

దళితుల భూమి గుంజుకున్నారు

- రూ.వందల కోట్ల విలువైన భూమికి అందని పరిహారం
- 1990 నుంచీ ప్రభుత్వాలు నాటకాలు

భూపత్రాలు చూపుతున్న కొమ్మాది దళితులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

భూమి చేతుల్లోకి రావడంతో జీవితంలో తిండికి వెనక్కి తిరిగి చూడాల్సిన పని ఉండదని ఆ ప్రాంతంలోని పేద దళితులంతా ఆశించారు. కానీ, వారి ఆనందం ఎక్కువ సంవత్సరాలు నిలువలేదు. ఆ భూమిని గుంజుకుని పరిహారంగా భూమికి భూమి ఇస్తామని ప్రభుత్వం చెప్పి వారిని మోసగించింది. వారికి నేటికీ న్యాయం చేయడం లేదు. దీంతో, వారు దీనవాస్థలో పడి రోదిస్తున్నారు. విశాఖ గ్రామీణ ప్రాంతమైన కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెంలకు చెందిన 80 మంది దళితులకు 1979లో 80 ఎకరాలను అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆ భూములు వీరి చేతికొచ్చేసరికి వీరంతా యువతీ, యువకులుగా ఉన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు. తమకు పెళ్లిళు అయితే తమ పిల్లలు, కుటుంబాల భవిష్యత్తుకు ఢోకా ఉండదని వీరంతా ఆశించారు. అయితే, 1990లో అప్పటి ప్రభుత్వం మాయమాటలు చెప్పి ఆ భూములను వెనక్కి లాక్కొంది. దీంతో, వారికి జీవనాధారం పోయింది. గంజినీళ్లు కూడా కరువయ్యాయి. ప్రస్తుతం వారి వయస్సు 65 ఏళ్లు దాటడంతో కూలి పనులకు వెళ్లలేని స్థితిలో ఉన్నారు.

అప్పట్లో ఏం జరిగింది ?

దళితులకు పంపిణీ చేసిన మెరక భూములు సర్వే నెంబరు 93/19, 97/91, 102/1లలో ఉన్నాయి. గంటెలు, కొర్రలు, సజ్జలు, పెసలు, నువ్వులు, ఉలవలు, జొన్న వంటి తిండిగింజలు పండించుకుని అప్పట్లో జీవించామని ఆ గ్రామాలకు చెందిన సియ్యాద్రి పైడితల్లి, అప్పయ్యమ్మ, సియ్యాద్రి అప్పన్న, పైలమ్మ తెలిపారు. 1990వ దశకంలో నవోదయ సంస్థ కోసం వీటిలో 40 ఎకరాలు కావాలని ప్రభుత్వం కోరగా, ఇవ్వడానికి వారు తొలుత నిరాకరించారు. బక్కన్నపాలెంలో భూమికి భూమి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఒప్పుకొని భూమిని అప్పగించారు. ప్రభుత్వం హామీని నిలబెట్టుకోకపోగా, పోలీస్ ట్రైనింగ్ స్కూల్ పేరుతో కొంత, హుదూద్ ఇళ్ల నిర్మాణం కోసం ఇంకొంత మొత్తంగా 80 ఎకరాలనూ తీసేసుకుంది. హుదూద్ ఇళ్ల కోసం వీరిని ప్రభుత్వం జాగా అడిగినప్పుడు భూములు కోల్పోయిన 80 మందికి ఇళ్లను వాటాగా ఇస్తామని చెప్పి 2013లో టిడిపి ప్రభుత్వం మోసగించింది.

పరిహారమూ లేక.. ఇళ్లు లేక అవస్థలు

పరిహారం కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నా ఏ ప్రభుత్వమూ తమను పట్టించుకోలేదని దళితులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఎకరా భూమి రూ.10 కోట్లుపైగా ధర పలుకుతోంది. కోట్లాది రూపాయల విలువైన భూమిని వదులుకున్నా కనీసం తమపై ప్రభుత్వాలకు కరుణ లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక మంత్రిగా ఉన్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును దళితులంతా కలిసి సమస్యను విన్నవించారని కెవిపిఎస్ జిల్లా నాయకులు సియ్యాద్రి పైడితల్లి తెలిపారు. అయినా, సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. దళితులకు జగనన్న ఇళ్లు ఇస్తామని మంత్రి ఇచ్చిన హామీ కూడా అమలు నోచుకోలేదని తెలిపారు.

మా ఆత్మగౌరవాన్ని లాక్కొన్నారు

చేతిలో భూమి ఉంటే పేదలు ఆత్మగౌరవంతో బతకొచ్చని నీతులు చెప్పే ప్రభుత్వాలే మా ఆత్మగౌరవాన్ని లాక్కొన్నాయంటూ కొమ్మాదికి చెందిన సోమమ్మ వాపోయారు. తమను ఆర్థిక పరిస్థితులు పీడిస్తున్నా ఏళ్ల తరబడి రూ.వేలకు వేలు చేతి ఖర్చులు పెట్టుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని, ఆందోళనలు చేస్తున్నామని దళితులు తెలిపారు. శరీరంలో ఓపిక లేకపోయినా తమ పిల్లల భవిష్యత్తు కోసం ఊపిరి ఉన్నంత వరకూ పోరాడతామని అప్పన్న, పైలమ్మ చెప్పారు. 2024 ఎన్నికల్లోపు తమకు పరిహారం, ఇళ్లు ఇవ్వకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులూ ఇదే విషయాన్ని ముక్తకంఠంతో చెప్పారు.

ఎకో సెన్సిటివ్ జోన్‌పై దశలవారీ ఆందోళనలు : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరులోని ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రవి డిమాండ్ చేశారు. లేకపోతే దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏలూరు పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో ప్రజల పొట్ట కొట్టొద్దని, మూడో కాంటూరుకు కుదించి కొల్లేరు ప్రజల జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. 2006లో అప్పటి ప్రభుత్వాలు కొల్లేరు ఆపరేషన్ పేరుతో జిరాయితీ, సొసైటీ చెరువులను ధ్వంసం చేసి కొల్లేరు ప్రజలను రోడ్డునపడేశారని, నేడు మళ్లీ పర్యావరణ సున్నిత ప్రదేశం పేరుతో ఐదో కాంటూరుపైన ఉన్న 89 గ్రామాల ప్రజల 'కొంప కొల్లేరు' చేసే ఈ నిర్ణయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే కొల్లేరు ప్రాంతంలో పేదలు, దళితులంతా ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు పోతున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న 22 వేల ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని కోరారు. కొల్లేరు కాలుష్యాన్ని నివారించేందుకు గతంలో చేసిన నిర్ణయాలు ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. కొల్లేరు ప్రజలకు సిపిఎం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ఆ ప్రాంత ప్రజలకు అదనంగా ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. 30న జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, కొల్లేరు ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రముఖులను ఆహ్వానిస్తామని తెలిపారు.

రాజ్యాంగం దేశానికి మూల స్తంభం : గవర్నరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యాంగం దేశానికి మూల స్తంభం అని, మారుతున్న ప్రజల ఆకాంక్షలు, అవసరాలను ప్రతిబింబించే సామాజిక, రాజకీయ పత్రమని గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. నిరంతరం అభివృద్ధి చెందుతూ.. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా సజీవ పత్రంగా మారుతోందన్నారు. రాజ్‌భవన్‌లో ఆదివారం 74వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి గవర్నరు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ఒక ధృడమైన ఫ్రేమ్ వర్క్‌గా కాకుండా అనువర్తన పత్రంగా ఉండాలని వ్యవస్థాపక పితామహులు కోరుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ మల్లాది విష్ణు, హైకోర్టు న్యాయమూర్తులు, సిఎస్ జవహర్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్ శ్రీరామ్, మహిళా కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ, రాష్ట్ర చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనరు మహబూబ్ బాషా, విజయవాడ సిపి కాంతిరాణాటాటా, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు ఎస్ డిల్లీరావు పాల్గొన్నారు.

కూచిపూడి కళా వైభవం పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూచిపూడి కళా వైభవం పోస్టరును సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి రోజా ఆదివారం ఆవిష్కరించారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఎబిసి ఫౌండేషన్ సంయుక్తంగా కూచిపూడి కళా వైభవం పేరిట గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు కోసం 7,209 మంది కళాకారులతో డిసెంబర్ 24న గచ్చిబౌలి స్టేడియంలో మహా బృంద నాట్య కార్యక్రమం చేపట్టనుంది. పోస్టరు ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవాడలోని భవాని ఐల్యాండ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు లలితరావు, ఎబిసి షౌండేషన్ అధ్యక్షులు కెవి రమణారావు పాల్గొన్నారు.

బర్రెలక్క కోసం పార్టీల అభ్యర్థులు వైదొలగాలి

- నేనూ ప్రచారం చేస్తా.. : జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

తెలంగాణ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బర్రెలక్క (కర్నె శిరీష)ను గెలిపించి, భారత రాజ్యాంగానికి వన్నె తేవాలని సిబిఐ మాజీ జెడి వివి లక్ష్మీనారాయణ కోరారు. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను పోటీ నుండి తప్పించి బర్రెలక్కకు మద్దతుగా నిలవాలని కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని విజె కాలేజీలో ఆదివారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రజలకు చేసిన హెచ్చరికలను ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో కుటుంబ పాలన, వ్యక్తి పూజలు రాచరికానికి దారితీస్తాయని తెలిపారు. మనకోసం మనం రాసుకున్న రాజ్యాన్ని పరిరక్షించాలంటే, ఎన్నికల్లో డబ్బున్న వారికి కాకుండా ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న సామాన్య యువతకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. అందుకే తాను బర్రెలక్క కోసం ప్రచారం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో విజె కాలేజీ డైరెక్టర్ పి రాజశేఖర్ పాల్గొన్నారు.

గనిలో ప్రమాదం.. ఒకరు మృతి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు: అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కొండుపల్లి గ్రామ సమీపంలోని భూగర్భ గనిలో ఉన్న డోలమైట్‌ను వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన జిలిటిన్‌స్టిక్స్ పేలి ఆదివారం ఓ వ్యక్తి ఘటనా స్థలంలోనే మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనాపురం, రావులుడికి గ్రామాలకు చెందిన కొందరు కూలీలు ఆదివారం కొండుపల్లి వద్ద ఉన్న రాజపుల్లయ్య మినరల్స్ డోలమైట్ గనిలో పని చేసేందుకు వెళ్లారు. రాయి పెకలింపు కోసం రోజువారి పేలుడు సామగ్రి(ఘాతాలు) సుమారు 15 చోట్ల పెట్టి పేల్చారు. వీటిలో రెండు పేలలేదు. పేలని వాటిని గుర్తించేందుకు వెళ్లగా, అవి పేలడంతో కంబగిరిస్వామి(38) మరణించగా, రాజ్‌కుమార్ తీవ్ర గాయాల పాలయ్యారు.

ADITYA BIRLA CAPITAL
PROTECTING INVESTING FINANCING ADVISING

ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : ఇండియన్ రెయాన్ కాంపౌండ్, వెరవల్, గుజరాత్- 362266
శాఖా కార్యాలయం : 3వ అంతస్తు, డోర్ నెం. 40-1-52ఎ, కెబిసిఎల్ భవనం హెడిఎఫ్‌సి బ్యాంక్ ఎదురు, బెంజ్ సర్కిల్ వద్ద, ఎమ్‌జి రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.

అనుబంధం IV (సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, యొక్క రూల్ 8(1)చూడండి) స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారుడు అయిన ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూర్డ్ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్షన్ 13(12)క్రింద అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగిస్తూ **11.09.2023 తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీతలు : షబ్బార్ షేక్, జరీన షేక్, శ్రీలక్ష్మి మెడికల్ అండ్ ఫాన్సీ స్టోర్స్, నోటీలో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడానికి ఉన్న రూ॥27,66,259.16/- (ఇరవై ఏడు లక్షల అరవై ఆరు వేల రెండు వందల యాభై తొమ్మిది రూపాయల పదహారు పైసలు మాత్రమే)** నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని తెలపడమైనది.

రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా ఆధీకృత అధికారి అతని అధికారాలను నిర్ణయించి అధ్యాయనం చేస్తూ రూల్ 8 చదువుతూ సదరు చట్టం సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్థిని **24 నవంబర్, 2023 వ తేదీన** దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకున్నాడు.

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు **రూ॥ 27,66,259.16/- (ఇరవై ఏడు లక్షల అరవై ఆరు వేల రెండు వందల యాభై తొమ్మిది రూపాయల పదహారు పైసలు మాత్రమే)** దానిపై వడ్డీతో సహా చెల్లించి జరుపవచ్చు.

రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

స్థిరాస్తి వివరణ:

అంశం నం.1 : గుంటూరు జిల్లా, దుగ్గిరాల ఎస్‌ఆర్‌ఓ., పెరుకలపుడి గ్రామ పంచాయతీ ఏరియా, పెరుకలపుడి గ్రామంలో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.103/3, డో.నం.1-64 వద్ద, ఇంటి ట్యాక్స్ రసీదు ప్రకారం డో.నం.1-92, మూల్యాంకనం నం.92 ఆస్తి విస్తీర్ణం 182 చ.గ.లు. తో అన్నీ సౌలభ్య హక్కులు ఉన్న **హద్దులు : తూర్పు:** మాకినేని పున్నయ్య గోడ 48-0 అ.లు., **పడమర :** పంచాయతీ రోడ్డు మరియు కడియాల బసవపున్నయ్య సైట్ 48-0 అ.లు., **ఉత్తరం:** మొక్కపాటి వెంకయ్య మరియు 2వ అంశం సైట్ 33-6 అ.లు., **దక్షిణం:** నూతలపాటి శ్రీనివాసరావు ఉమ్మడి గోడ సైట్ 34-6 అ.లు.

అంశం నం.2 : గుంటూరు జిల్లా, దుగ్గిరాల ఎస్‌ఆర్‌ఓ., పెరుకలపుడి గ్రామ పంచాయతీ ఏరియా, పెరుకలపుడి గ్రామం లో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.103/3, డో.నం.1-64 వద్ద, ట్యాక్స్ రసీదు ప్రకారం డో.నం.1-92, మూల్యాంకనం నం.92 ఆస్తి విస్తీర్ణం 57 చ.గ.లు. తో అన్నీ సౌలభ్య హక్కులు ఉన్న **హద్దులు : తూర్పు:** మొక్కపాటి వెంకయ్య మరియు ఇతరుల సైట్ 43-0 అ.లు., **పడమర :** మొక్కపాటి వెంకయ్య సైట్ 43-0 అ.లు., **ఉత్తరం :** ఉమ్మడి గల్లీ 12-0 అ.లు., **దక్షిణం:** 1వ అంశం 12-0 అ.లు. పై రెండు అంశములు 1 మరియు 2 కొరకు ఆస్తి విస్తీర్ణం 239 చ.గ.లు.

తేది: 24.11.2023 — **అధీకృత అధికారి**
ప్రదేశం: గుంటూరు — **ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 27 నవంబర్ 2023



ఎవడు ఇక్కడ రైతు
ఎవడు ఇక్కడ రాజు
కష్టించు వారొకరు
కాజేయువారొకరు

– పొట్లపల్లి రామారావు

ఏ నేలమీదైనా ...

గెలుపెవరిదో
ఎవరు ఎవర్ని గెలిచారో
గెలుస్తారో తెలియదు
అసలు గెలవటమంటే ఏమిటో కూడా తెలియదు
ఖచ్చితంగా ఓడేది మాత్రం మేమే!

తల్లుల్ని కోల్పోయాం, తండ్రుల్ని కోల్పోయాం
అనాథ జీవచ్ఛావాల్లా యుద్ధభూమిలో
ఇంకెవర్ని వెతుక్కోవాలో తెలియని
దిక్కుతోచని స్థితిలో దారం తెగిన
గాలి పటాలమై తిరుగుతున్నవాళ్లం!

తలలు కోల్పోయి కాళ్లు కోల్పోయి
చేతులు తెగిపోయి
మా కలలు మా సావాసగాళ్ల కలలు
నిస్తేజంగా పడి వున్నాయి
రక్తమూ అనేక కన్నీళ్లతో పాటు
లేలేత మా రక్తంతో తడిసిన నేల
పచ్చి పచ్చిగా వుంది
మీరెవరు గెలిచారో, ఎవరు గెలుస్తారో
లేత పావురాలం మాకైతే తెలియదు
మా కలల రెక్కలు తుత్తునియలై
నేలంతా పరుచుకున్నాయి

చందమామ, చుక్కలూ, మిణుగురులూ
మా అమ్మా నాన్నలతో
మేం తిరుగాడిన పచ్చని నేలంతా
యుద్ధ రక్తం పులుముకుని
మట్టికి దేహాలకు తేడా తెలియని
శవాల దిబ్బలా మారిపోయుంది

ఎవరు ఎవరికోసం పోరాడుతున్నారో
ఎవరు ఎవరి కోసం ఏం బావుకుందామని
ఇంత బీభత్సమవుతున్నారో మాకు తెలియదు

మాకు తెలిసిందల్లా కళ్లల్లో ఇంత ప్రేమనేసుకొని
ఇంద్రధనుస్సుల్ని, తూనీగల్ని, కలువపూలనీ
వెంటేసుకుని పచ్చని నేలనిండా
నవ్వుల పువ్వుల్ని పూయిస్తూ
కేరింతల సందళ్లయి ఎగరటమే!

గెలిచేదెవరో, ఓడేదెవరో
మాకు లెక్కలు తెలియవు
ఖచ్చితంగా ఓటమి మాత్రం
మాలాంటి పిల్లలదే !

ఆకాశమంత కలల్ని నింపుకుని
నేలంత పచ్చదనాన్ని పరుచుకుని
రేపటిని స్వప్నిస్తూ
జింకపిల్లల్లా, సెలయేటి నదుల్లా
ఏ నేలమీదైనా పరుగుపెడుతున్న
మాలాంటి పిల్లలదే !

– చిత్తలూరి
91338 32246

రైతు

నాగలి ఎత్తిన వాడు
పొగిలి పొగిలి ఏడవాలా?
విత్తనాలు చల్లిన వాడు
విత్తానికి దూరమవ్వాలా?
నెర్రలు చీలిన నేల
గుండెలో నెగళ్లు మండిస్తుంటే
దళారి బతుక్కి తలారీగా మారితే
కృత్రిమ మేధ కోసం
కోట్లు గిలకరించే వారు
సహజ మేధకి సారాన్ని ఇచ్చే
అన్నదాతపై ఎందుకు లేదు కనికరం?
రైతు నడిచే నేల ఒక పుణ్య క్షేత్రం
రైతు పంటే ఒక వ్రతం
అందరి ఆకలి తీర్చే రైతే దేవుడు!
రాతి దేవుడి కన్నా గొప్ప వాడు
అన్నం తిన్నాక అద్దం చూసుకుంటే
అక్కడ ప్రతిబింబం రైతే!

– వీరేశ్వర రావు మూల
94947 46228

మనం మరిచిన అతని జీవితం

అన్నం నీకు పెట్టి
పురుగు మందు తాను తింటాడు
తాను పస్తులుండి నీకు భోజన తృప్తిని
ఇస్తాడు

జీవితంలో రక్తాన్ని నదిగా చేసి
వ్యవసాయం చేస్తాడు ...
అప్పుల కుప్పల కింద పూడుకుపోయిన
మౌనంతో సాగుతాడు
పేదరికపు సాలె గుడిలో చిక్కిన
పిచ్చి పురుగు ...
అందరూ సుఖపడిన బతుకులో
అతనొక్కడు మాత్రమే!
దుఃఖాన్ని దిగమింగుకొని
ఛిద్రమైన జీవితంతో
దేశానికి ముఖచిత్రమవుతున్నాడు!

– పుష్యమీ సాగర్
79970 72896

శ్రీశ్రీ అవగాహనలో గురజాడ

"గురజాడను కవిగా గుర్తించ లేని 'వెధవాయ'ను మనిషిగా నేను గుర్తించలేను" అన్నారు మహాకవి శ్రీశ్రీ.

(శ్రీశ్రీ గురజాడ సంస్మరణ సంచిక, 1976)





53 ఏళ్ళ మాత్రమే జీవించిన గురజాడ అప్పారావు (1862–1915) 30 ఏళ్ళ సాహిత్య జీవితంలో రాయగలిగింది పట్టుమని 1600 పుటలైతే; ఆ సాహిత్యం మీద వచ్చిన విమర్శ కనీసం 25 వేల పుటలుంటుంది. తెలుగు వాళ్ళు గురజాడను ఎంతగా సొంతం చేసుకున్నారో దీనివల్ల తెలుస్తుంది. ఈ 25 వేల పుటల గురజాడ సాహిత్య విమర్శలో శ్రీశ్రీ రాయగలిగింది. 100 పుటలు మాత్రమే! అయితే ఈ 100 పుటల శ్రీశ్రీ విమర్శ గురజాడకు ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో సుస్థిరస్థానం ఏర్పరిచింది. ఒకరకంగా శ్రీశ్రీ గురజాడ సాహిత్యలాలసుడు. ఆయన గురజాడ మీద రాసిన వ్యాసాలు, చేసిన ప్రసంగాలు, ఇతరుల అడిగిన ప్రశ్నలను చెప్పిన సమాధానాలు ఈ నిజాన్ని రుజువు చేస్తున్నాయి.

ఒక కొత్త భూఖండాన్ని కనిపెట్టడానికి బయలుదేరిన సాహస యాత్రికుడు (1955), గురజాడ మహాప్రవక్త (1954), ఆయన ఒక విప్లవ కవి కూడా (1954) వంటి నిర్వచనాలు గురజాడంటే శ్రీశ్రీకి గల గౌరవాన్ని చాటుతున్నాయి. గురజాడ 53 ఏళ్ళకే మరణించడం పట్ల శ్రీశ్రీ రెండు మూడు పర్యాయాలు బాధపడ్డారు. "ఆయన మరణం ఒక్క ఆంధ్రదేశానికే కాదు, యావదార్భరత దేశానికే తీరని నష్టం. 1915 నవంబరు నెలలో ప్రపంచం ఒక మహారచయితను కోల్పోయిందనే చెప్పాలి" (1954); "మరో 20 ఏళ్ళయినా గురుజాడ అప్పారావు గారు బ్రతికిఉంటే మన సాహిత్య క్షేత్రం ఎంత సస్యశ్యామలమయ్యేదో" (1976) అని శ్రీశ్రీ ఆవేదన చెందారు.

ఆధునిక కవిత్వానికి పితామహుడు ఎవరు అనే ప్రశ్నకు గురజాడ అప్పారావే అని, ఆధునిక తెలుగు కవిత్వానికి మార్గదర్శనీయుడు ఎవరంటే "ఒకే ఒక్క మార్గదర్శి అతడే గురజాడ" అని సమాధానం చెప్పారు. (1983) 20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యానికి మార్గ నిర్దేశం గురజాడేనన్నది శ్రీశ్రీ అభిప్రాయం, "తెలుగు సాహిత్యాన్ని ఇరవయ్యో శతాబ్దంలోని ప్రవేశపెట్టిన ఘనత గురజాడకే దక్కుతుంది" అని గట్టిగా చెప్పారు. (1975).

బసవరాజు అప్పారావు, కవికొండల వెంకటరావు, చింతా దీక్షితులు తనకు మార్గ దర్శకులని, వీళ్ళ మీద గురజాడ ప్రభావముందని, వీళ్ళ ద్వారానే తాను గురజాడ చదివానని, అప్పటి నుంచి గురజాడ ప్రభావం తన మీద బలంగా పడిందని శ్రీశ్రీ రెండు, మూడు పర్యాయాలు చెప్పుకున్నారు. గురజాడ అనే మేడను అధిరోహించడానికి ఆ ముగ్గురూ మెట్లుగా ఉపయోగపడ్డారని స్పష్టంగా చెప్పారు. (1970). తిక్కన, వేమన, గురజాడల తన కవిత్రయమని శ్రీశ్రీ చాలాసార్లు చాటుకున్నారు. కారణాలు కూడా చెప్పారు. వాళ్ళు తెలుగు కవులయినా, "మనం కడచిన వెయ్యేళ్ళలో ప్రపంచానికి కనీసం ముగ్గురు మహాకవులను ప్రసాదించాం" అని కూడా అన్నారు (1972). 1954 నుండి 1980 దాకా ఈ అభిప్రాయం చెబుతూనే వచ్చారు. అంతేకాదు, "వేమన, గురజాడలిద్దరూ ఏనాడో సామ్యవాదానికి రాచబాట వేసేశారు" అని మరణించే ముందు (1983) శ్రీశ్రీ ప్రకటించడం విశేషం.

శ్రీశ్రీ మహాత్మాగాంధీ, గురజాడల మధ్య ఆసక్తికరమైన పోలిక తుచ్చారు. "దరిద్ర నారాయణుని చిహ్నమంటూ కొల్లాయి కట్టుకొని నిరాడంబర మూర్తియై గాంధి . గారు అవతరించినప్పుడు ప్రపంచమంతా ఆయనను ఉగ్గడించింది. కవితారంగంలో గురజాడ అలాంటి నిరాడంబరత అవలంబించారు" (1954). "గాంధీజీ నిత్య జీవితంలో నిరాడంబరతను స్వీకరించినట్లే గురజాడ కవితా శిల్పంలో వ్యర్థాలంకారాలనూ, వాచలత్వాన్ని, కరచరణాలు కట్టి పడవేసే కట్టుబాట్లను తొలగించారు" (1960).

శ్రీశ్రీ గురజాడను రవీంద్రనాథ్ ఠాగూర్ కన్నా ఒక మెట్టు పైన నిలపడానికి ప్రయత్నించారు. అలాగే ఠాగూరు, సుబ్రహ్మణ్య భారతి కన్నా గురజాడ గొప్ప రచయిత అని అభిప్రాయపడ్డారు. ఠాగూర్, గురజాడల మధ్య అంతరం ఎంత? అనే ప్రశ్నకు "టాగూర్ కన్నా భవిష్యత్తులోకి గురజాడ ఎక్కువ దృష్టి సారించారు" అని సమాధానం చెప్పారు. (1984)"

బెంగాల్‌లో టాగూరు, తమిళనాడులో సుబ్రహ్మణ్య భారతిలాంటి వారికి మనం యావద్భారత కీర్తి అంటగడుతున్నాం. ఆ దృష్టితో చూస్తే నా ఉద్దేశంలో మీరందరి కన్నా గొప్పవాడు గురజాడ అప్పారావు" (1982) అని తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు. అంతేకాదు ఆయన ఒక ఫిర్యాదు కూడా చేశారు. "టాగూర్‌కు దేశామంతటా మందిరాలు నెలకొల్పారు గాని మన గురజాడ పేరున ఏం చేశారు? (1982) మనవాళ్ళు. 50 ఏళ్ళ తర్వాతనైనా దీనిని గురించి ఆలోచించాలి." గురజాడకు శ్రీశ్రీ ఎంత అత్యున్నత స్థానం ఇచ్చారంటే- ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గోథే, ఇబ్సెన్ వంటి రచయితలతో తులతూగే మేధావి" అనడానికి సంకోచించలేదు (1954).

గురజావడ సాహిత్యమంతా శ్రీశ్రీకి ఇష్టమైనదే అయినా ప్రత్యేకించి గురజాడ నాటకాలతో 'కన్యాశుల్కం'; కథలలో 'మీ పేరేమిటి?'? కవితలలో 'దేశభక్తి' గురించి ఆయన చాలా అభిప్రాయాలు చెప్పారు. గురజాడ సాహిత్యంలో 'కన్యాశుల్కం' నాటకం మీద వ్యాసంతోనే శ్రీశ్రీ విమర్శ మొదలైంది. "జీవితంలో ఏ సందర్భానికైనా సరిపోయే మాటలు ఎక్కడో ఒకచోట మహా కవిలో దొరకుతాయి" (1945) అని కన్యాశుల్కం నాటకానికి అన్వయించారు. కన్యాశుల్కంలో గిరీశం, రామప్పంతులు, లుబ్ధావధాన్లు వంటివారు ట్రాజిక్ హీరోలని; వాళ్ళది, "శిథిలీకృతమవుతున్న ఒకానొక సాంఘిక వ్యవస్థ యొక్క కరాళనృత్యం" అనీ; "కన్యాశుల్కం బీభత్సరస ప్రధానమైన విషాదాంత నాటకం" అని నిర్వచించారు (1945). ఈ నిర్వచనాలు తర్వాత కాలంలో ప్రజల నాలుకల మీద నాట్యం చేస్తున్నాయి.

1956 నాటికల్లా కన్యాశుల్కం నాటకం మీద శ్రీశ్రీ అవగాహన మరింత పరిపక్వమైంది. "సమకాలిక జీవితాన్ని వాస్తవానికి అనుగుణంగా చిత్రించిన ప్రథమ నాటకం కన్యాశుల్కము" అని 1956లో నిర్ధారించారు. సంస్కృత 'మృచ్ఛకటికం' తర్వాత కన్యాశుల్కం నాటకం భారతదేశంలో రచింపబడేలేదు" అని 1957లో శ్రీశ్రీ ప్రకటించారు. ఇదే అభిప్రాయాన్ని 1960లో కూడా పునరుక్తి చేశారు. కన్యాశుల్కం కేవలం నాటకం కాదనీ, ఒక పెద్ద జీవిత ఖండమని మరో సందర్భంలో నిర్వచించారు (1965). ఈ అభిప్రాయాలన్నీ ఒక ఎత్తయితే, గురజాడను కన్యాశుల్కమే మహాకవిని చేసింది అనడం చాలా ఆలోచలను రేకెత్తిస్తుంది (1983). "విశ్వ సాహిత్యంలో మధురవాణితో పోల్చగలిగిన పాత్ర మరొకటి లేదు" అంటూనే "ఎమిలీజోలా సృష్టించిన 'నానా' అనే 19 శ. పరాసు వేశ్య వసంతసేనగా ప్రారంభించి, మధురావాణిగా మారుతుంది" అని ఆయన తన అవగాహనను విస్తరించారు. (1947). "కన్యాశుల్కంలోని ఇతర పాత్రలే బైరాగిని సృష్టించాయి" (1948) వంటి అనేక అభిప్రాయాలు కన్యాశుల్కం నాటకంలోని లోతులకు శ్రీశ్రీ ఎలా వెళ్ళారో చెబుతాయి.

గురజాడ తక్కువ కథలు రాసినా 'ఒక్కొక్క ఒక్కొక్క వజ్రపు తునక' అని అన్నారు శ్రీశ్రీ. అయినా వాటిలో తనకు వచ్చిన కథ 'మీ పేరేమిటి?' అన్నది అని కూడా అన్నారు. ఆ కథలో మహత్తర కథనకౌశలం, కన్యాశుల్కం నాటకంలోని నాటకీయత ఆ కథలో ఉందనీ పేర్కొన్నారు. 'నాకు నచ్చిన కథ' అనే వ్యాసంలో ఒక కథలో భగవంతుని పేరిట పోరాడుకోవడం మాని, మానవుని పేరిట ఐక్యం కావాలన్నదే గురజాడ ఇచ్చిన సందేశమని వివరించారు. మన జాతిని ఇప్పటికీ చేతకాకుండా పోతున్నది ఇదే! ఆ కథలో గ్రామ రాజకీయాలు ఉన్నాయని గుర్తించారు (1970).

'దేశభక్తి' గేయం అంటే, శ్రీశ్రీకి ఎనలేని గౌరవం, ఇష్టం. ఎంత ఇష్టమంటే గురజాడ రచనలన్నీ నష్టమై పోయి ఒక్క దేశభక్తినీ మిగిలినా చాలు.. అతడు ప్రపంచ కవులలో ఒక్కడుగా లెక్కించదగిన మహాకవి అని రుజువు కావడానికి.. అనేంత (1958). 'దేశభక్తి' కవిత ప్రపంచ మహాజనుల జాతీయగీతమని వర్ణించారు. తెలుగు కవి ప్రపంచానికిచ్చిన కవిత్వపు కానుక అని పేర్కొన్నారు. ఆ గీతం ఒక్కటే ఒక మహాకావ్యమన్నారు మరోసారి (1959).

'దేశమును ప్రేమించుమన్నా అని అనడమే ఒక సాహసం అన్నారు శ్రీశ్రీ (1967). "ఎందుకంటే దేశభక్తిలో భావవాదం పేరుకు పోయిన దశలో భౌతికవాదం ప్రవేశం పెట్టారు గురజాడ. దేశమంటే మనుషులని గుర్తుచేశారు. మనుషుల్ని ప్రేమించడే దేశాభిమానమని ఆధిపత్యవాదుల వాదానికి ప్రత్యామ్నాయ వాదాన్ని ప్రవేశపెట్టారు. కన్యాశుల్కం నాటక ప్రదర్శన జరిగినప్పటి నుంచి గురజాడ సాహిత్యం మీద విమర్శ వస్తూనే ఉంది. అందులో శ్రీశ్రీ అభిప్రాయాల విలువ సాటిలేనిది. గురజాడకు సంబంధించినంత వరకు శ్రీశ్రీ ప్రేరణాత్మక విమర్శకుడు.

"ఏ కవికైనా అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్రా, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవియొక్క సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలి అయితే ఆగమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను." - శ్రీశ్రీ.

(గురజాడ ఆధిక్యానికి కారణాలు, 1954)

(నవంబరు 30 : గురజాడ వర్ధంతి)

– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

మానవ నేస్తాలు సూక్తులు

"మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు/ మచ్చుకైనా లేడు చూడు మానవత్వమున్న వాడు' అని డా.అందెశ్రీ అన్నట్లు - ఒకవైపు చంద్రయాన్ లాంటి ప్రయోగాలతో అంతరిక్షంలోకి దూసుకుపోతుంటే, మరోవైపు మణిపూర్ లాంటి అమానుష సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నత విద్యలు చదివి విలువలు కోల్పోతూ, ఆదిమ నాగరికత ఆరంభాన్ని తలపిస్తున్న నేటి సమాజానికి సూక్తులు అవసరం ఎంతైనా ఉందని చెప్పొచ్చు.

'నడిపించే చైతన్యం లేనిదే నడవదు ఈ సృష్టి' అని డా.సి. నారాయణ రెడ్డి గారన్నట్లు, నేటి సమాజానికి రచయితలు, మేధావుల ఆలోచనలు, సూక్తులు చాలా అవసరం. అలాంటి సదభిప్రాయంతో రాసినవే గార రంగనాథం మాస్టారి 'సూక్తి రత్నమంజరి.' 150 శ్లోకాలకు 150 ఆటవెలది పద్యాలతో అనువదించిన ఈ సూక్తి రత్నామంజరి ప్రతి పద్యం సామాజిక దక్పథంతో రాయబడింది. 'పరదారాన్ పరద్రవ్యం,/ పరీవాద పరస్య చ/ పరీహాసం గుర్ణో స్థానే,/ చాపల్యం చ విసర్జయేత్' అన్న శ్లోకానికి తెలుగులో ఈ కింది విధంగా ఆటవెలది పద్యంలో అనువదించారు.

పరధనము కోర్కె పరకాంత నాశింత
పరులనింద, గురుల పరిహసనము,
విషపుచెట్టు పండ్లు విడిచిన మేలౌను
రంగడనువదించె రక్తి వినుమ'.

చెడు అలవాట్లను మానుకోమని నేటి తరానికి సూచించారు. పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ ఏ విధంగా ఉండాలో కింది పద్యంలో హృద్యంగా చెప్పారు.

'పెంచు రాజు వలెను మంచిగా నైదేళ్లు
పదియు నేళ్లు మరియు బానిసగను
మిత్రు కరణి పెంచు పుత్రుని కడదాక'

శ్రద్ధ లేని చోట విద్య నేర్పడం చవిటి నేలలో విత్తనాలు చల్లినట్లుగా ఉంటుందని నేటి విద్యా విధానం గురించి తెలియచెప్పే తీరు అద్భుతంగా ఉంది. తన జీవితానుభవంతో ప్రాణమున్న వరకు జ్ఞానార్జన చేయడం మంచిది అని, జ్ఞానానికి ఉన్న విలువ ధనానికి ఉండదన్న నగ్న సత్యాన్ని చెప్పారు. మనిషి చేసే పనులు బట్టే మంచి చెడులు చేకూరుతాయని వాస్తవ పరిస్థితిని తెలిపారు.



'గొయ్యి తవ్వు వాడు గోతిలోనికి పోవు
గోడ కట్టు వాడు మేడ జేరు' అన్నారొక పద్యంలో.

దుఃఖం చాలా ప్రమాదకరమని, కాబట్టి చింత లేని జీవితాన్ని గడపాలని సూచించారు. విజ్ఞాని వినయ వంతుడగుచూ, విద్య లేని వాడేవిర్రవీగడాన్ని నిండు కుండ తొనకదు అనే లోకోక్తితో పోల్చి చెప్పారు. మరొక శ్లోకాన్ని 'బీజములనునాటి భేషుగా రక్షింప/ ఫలము లిచ్చు గాదె భావియందు/ మంచి నాటవలయు మనుజ లోకమున/ రంగడనువదించె రక్తి వినుమ.' అని అర్థవంతంగా కూర్చి చెప్పారు. సమాజంపై తన కర్తవ్యాన్ని ప్రకటించారు. సాధారణంగా మనం ఎవరికైనా ధనం ఇచ్చినపుడు మంచిగా ఉండి, ఇవ్వనపుడు నిందించడం పాలిచ్చిన ఆవు చుట్టూ తిరిగిన దూడ, పాలింకిన తర్వాత పట్టించుకోకపోవడం అనే లోకరీతిని తెలిపారు. మనం చేసే పనుల బట్టి ఫలితాలు ఉంటాయని, వాటిని భూమి మీద అనుభవిస్తారు తప్ప మరో జన్మంటూ ఉండదని, కావున సరియైన దారిలో జీవించాలని చెప్పడం మాస్టారి వాస్తవిక దృష్టికి తార్కాణం. చలి కాచుకోడానికి దాపకర్రని కాల్చి వేడి పొందితే పైకి ఎక్కలేని విధంగా, క్షణకాల ఆవేశాలకు విలువలను మంట గలపడం మంచిది కాదని సూచించారు. నల్లబల్ల అక్షర జ్ఞానాన్ని గల్గించి, జీవితాన్ని చక్కదిద్ది ఉన్నత స్థాయిలో నిలుపుతుంది, కాని మనం నలుపు అజ్ఞానానికి ప్రతీకగా చూడడం మూఢవిశ్వాసమే కదా!

పుస్తకాలు లేని గది ప్రాణం లేని శరీరం లాంటిదని, అన్నిటికంటే ఆత్మ విశ్వాసం గొప్పదని, గురువులందరి కంటే అంతరాత్మ గొప్ప గురువు అని చెప్పి గురుత్వాన్ని చూపించారు. వింటినారిని వెనుకకు లాగి వదిలితే వేగంగా ముందుకు పోయినట్లు, వీలుకాని చోట వెనకకు తగ్గడం సందర్భానుగుణంగా ప్రవర్తించాలని చెప్పడం గొప్ప విషయం. అన్ని విషయాలు అందరికీ చెప్పి, తాను ఆచరించకపోతే వాసన లేని గన్నేరు పువ్వులా వ్యర్థం అని చెప్పడం రంగనాథం మాస్టారి సునిశిత మేధకు నిదర్శనం. చీవజవతీ Stop learning, Because life never stops Teaching అనే ఆంగ్ల వాక్యాలకు –

'జీవితమ్ము నేర్పు జీవన పాఠాలు
మానవలదు నేర్వ మనుజు డెపుడు
మహిని మనుజన్మ మహిమాన్వితమ్ము రా
రంగడనువదించే రక్తి వినుమ.'

అని అనువదించడం నిరంతర సాహిత్యాధ్యయన శీలి అని, పుస్తక పఠనంపై మక్కువ కలిగినవారని తెలుస్తుంది. భావి తరాలు నిరంతర అధ్యనం అలవాటుగా చేసు కోవాలని మార్గదర్శనం చేయడం సంతోషించదగ్గ విషయమే కదా. 'సంసార విష వృక్షానికి రెండు అమృత తుల్యములు. కావ్యామృత రసపానం సజ్జన సాంగత్యము' అనే చిన్నయ సూరి మాటలు ఇందుకు నిదర్శనం కదా! ఈ విధంగా సూక్తి రత్న మంజరిలో ప్రతి పద్యం మనసుకు హత్తుకునేలా ఉంది. ప్రతి సూక్తీ మానవ మనుగడకు దోహదపడేదిగా ఉంది. ఈ పుస్తకం కోసం రచయితను 98857 58123 మొబైల్ నెంబరుపై సంప్రదించొచ్చు.

– రాజాపు శాంతారావు
77022 41896

మనిషిని తట్టిలేపే కవిత్వం



ఆచార్య నందిపాటి సుబ్బారావు వెలువరించిన 'అమరావతి' కవితా సంపుటి రాజధాని యొక్క గొప్పతనాన్ని చాటుతూ, సరికొత్త అనుభూతి కలిగిస్తోంది. ఇందులోని కవితలన్నీ కూడా మానవతా విలువలకు అద్దం పడతాయి. మనిషితనాన్ని తట్టి లేపుతాయి. గోదావరి యొక్క గొప్పతనం, సర్వమత సామరస్యం ఆవశ్యకత, ఇంకా దేశంలోని విధ్వంసాలను ఆపేదెవరు అంటూ ఆర్తిగా, ఆవేదనాభరి తంగా సాగిపోయే కవితలూ చదువరులను ఎంతో ఆకట్టుకుంటాయి. ఆచార్య నందిపాటి సుబ్బారావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భూవిజ్ఞానశాస్త్ర విభాగాధిపతిగా విద్యార్థుల్ని గొప్ప పౌరులుగా తీర్చిదిద్దారు. జలవనరుల పరిరక్షణపై విశేషంగా కృషి చేస్తున్నారు.

ఈ సంపుటిలోని మొదటి కవిత 'అక్షరమాల'. అక్షరమాలని అమ్మతో పోల్చి కమనీయం, రమణీయం తెలుగు భాష అంటూ కీర్తించారు. 'అమరావతి వైభవం' కవితలో ఆనాటి ధరణికోట ఈనాటి తెలుగు ప్రజల ఘన కీర్తి అంటూనే సర్వమత సమ్మేళనాలకు నెలవు అన్నారు. 'పులకిస్తున్న అమరావతి' కవితలో ఆంధ్రుల మహా స్వప్నం సాకారం కాబోతున్న వైనాన్ని చక్కగా చెప్పారు. 'మార్గ త్రయం- ఒకటి' కవితలో పరవళ్ళు తొక్కుతూ గలగల పారే గోదారిని కొనియాడారు. 'మార్గత్రయం-రెండు'లో యేసు గురించి, 'మార్గత్రయం-మూడు'లో రంజాన్ ప్రాముఖ్యం గురించీ వివరించారు. 'నిరాడంబరుడు' కవితలో అబ్దుల్ కలాంని ప్రస్తుతించారు. 'భారతావని' కవితలో- అవినీతి, అరాచకాలతో భారతమాత ఆవేదన చెందుతోందని హృద్యంగా చెప్పారు. 'చిరునామా లేని ఉత్తరం' కవితలో మనసుపెట్టి చెయ్యని పని చిరునామా లేని ఉత్తరం లాంటిదని పేర్కొన్నారు. 'ప్రకృతి - వికృతి' కవిత మనిషిలోని విధ్వంస చేష్టలకు అద్దం పట్టింది. 'నేను వృక్షాన్ని నీ ప్రాణ భిక్షాన్ని' కవితలో సకల ప్రాణికోటి మనుగడకు రక్షణ కవచంగా ఉపయోగపడుతున్న వృక్షం ప్రాధాన్యాన్ని వివరించారు. 'పచ్చనైన పల్లె వదిలి' కవితలో పల్లెను వదిలి కాలుష్యమైపోయిన పట్టణానికి వెళ్లి డాంబికాలు పోతే ఎలా ఉంటుందో చక్కగా కవిత్వీకరించారు. 'ఇదే ప్రపంచం' కవితలో మానవుడు చరవాణికి బందీ అయిన వైనాన్ని తెలియజేశారు. 'తానంటే తందానందురు' కవిత నేటి రాజకీయ నాయకులు అధికారం చేజిక్కించుకోవడానికి చేసే విన్యాసాలకు చురకలంటించింది.

'అనాగరికత' కవితలో మానవత్వం మంటగలుస్తున్న తీరును ఎద్దేవా చేశారు. కులమతాల కుమ్ములాటలో కొట్టుమిట్టాడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటారని సమాజాన్ని ప్రశ్నించారు రచయిత. బుద్ధుడు నడిచిన, గాంధీ పుట్టిన దేశంలో ఎప్పుడు మారణకాండలేనా, ఇకనైనా నిజాలు తెలుసుకొని అజ్ఞానాన్ని వీడండంటూ హితవు పలికారు. ఇలా అన్నీ కవితలు ఎంతో ఆసక్తిదయకంగా సాగిపోతూ సాహితీ ప్రియులను చదివింపజేస్తాయి. పుస్తక కోసం 98484 86967 మొబైల్ నెంబర్లో ఆచార్య నందిపాటి సుబ్బారావును సంప్రదించవచ్చు.

– పింగళి భాగ్యలక్ష్మి
97047 25609

రక్తసిక్త పాలస్తీనా

అక్కడ కొన్ని శవాలు
గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి
బహుశా రాబందుల రక్తదాహానికి
బలైన పావురాల పీనుగులై
ఉంటాయి ...
ఎందుకో తెలియదు గానీ,
వాటి మనసు ఇంకా
మరణించలేదు
వాటి హృదయంలోనుంచి ఇంకా
ఏవో శబ్దాలు ఫిరంగుల్లా పేలుతూ
వినిపిస్తున్నాయి... నిశ్శబ్దంగానే...
బహుశా శాంతి సందేశమేమో!

విష సర్పాలని, విద్వేసాలని పెంచి
తెల్లపూల వాన కలగంటే ఎలా?
శాంతి చిహ్నం రక్తసిక్త మయ్యే వేళ
కరుణామయుడు పుట్టిల్లు
కమురుకంపు కొడుతుంది!
అల్లా హృదయం బద్దలైంది
జోర్డాన్ నది రక్త కన్నీరై
పొంగుతుంది
మౌనం ఎప్పుడూ
మారణహోమమే!
వేనవేల శవాల గుట్టల మధ్య
ఎగిసిపడుతున్న నిప్పురవ్వలు
ద్వేషాన్ని వెదజల్లుతూనే ఉన్నాయి
యుద్ధంలో గెలుపూ ఓటమి
ఉండవు
ఇటూ అటూ విధ్వంసం తప్ప !

అమ్మపాలు తాగి రొమ్ము గుద్దడమే
యుద్ధతంత్రమైనపుడు
నేలంతా శ్మశాన స్థలే అవుతుంది
శాంతి కాముకుల మౌనం
మౌనంగానే మరో యుద్ధానికి
ఊపిరి పోస్తుంది
అవసరమే ఆయుధం అయితే
మానవత్వం మృగ్యపోతున్నది
అప్పుడు... అవును అప్పుడే
మౌనం విస్ఫోటనమై
అగ్నిశిఖలా ఎగసి పడుతుంటే
కారుతున్న ప్రతి రక్తపు చుక్కా
ఓ రక్తసిక్త కపోతమై రివ్వున
ఎగరాలి...
పాలస్తీనా నేలపై శాంతిపూలు
పూయాలి!

– రెడ్డి శంకరరావు
94943 33511

సేద్యగాడు

రెక్కలు నాటి, పక్షి మొలిచిందని గెంతుతాడు వాడు
అరచేతుల్లో ఆర్తిని ఆకాశానికి ఎగురవేస్తాడు
నాలుగు మాటలు చల్లి, విరులు ఇవే..
సుగంధాలని ఆస్వాదించండంటాడు

పుట్టెడు వ్యధల్నీ పుట్టల కథల్నీ
ఓపిగ్గా వీక్షించీ వినీ
చలనమున్న గుండె కనుక చమరిస్తాడు

చలిని దుప్పట్లో కాక తన గుండెలో
దాచి పెడతాడు కనుక
ఎండని నడినెత్తికి కాక
మనసుకి అంటించుకోవడం తెలుసు కనుక
అతడు సేద్యగాడు అని ముద్దుగా పిలిపించుకుంటాడు

అతని తృష్ణ అతనికి మాత్రమే కడుపు నింపదని

మరచి హేళన చేసినా
వీసమెత్తు బాధపడడు
అడుగులగు బంగారు తొడుగులతో పుట్టిన
వెండి పిల్లలేమోలే అని ఆపేక్షగా నవ్వుకుంటాడు

పథకాలకి పొంగి, సర్కారుని నమ్మి
మాత్రమే వ్యవసాయమంటే
అతడు మనల్ని చూసి జాలిపడతాడు
ఇంకా కాడెద్దు పాత్ర పోషిస్తున్నందుకు
అతడికి ఆ హక్కు ఉందిలే..!

– అనూరాధ బండి

2న అఖిల పక్ష సమావేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా డిసెంబర్ 2న కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. శీతాకాల సమావేశాలు డిసెంబర్ 4 నుంచి 22 వరకు నిర్వహించనున్న సంగతి విదితమే. సాధారణంగా పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ఒక రోజు ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. కానీ డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు విడుదల కానున్న దరిమిలా 2వ తేదీన అంటే పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి రెండు రోజులు ముందుగానే అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తుండటం విశేషం. శీతాకాల సమావేశాల్లో కీలక బిల్లులను ఆమోదించడానికి ప్రభుత్వం సంసిద్ధమైంది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై వచ్చిన "క్యాష్ ఫర్ క్వరీ" ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ నివేదికను లోక్‌సభ సెషన్‌లో ప్రవేశపెట్టనున్నారు. ప్యానెల్ సిఫార్సు చేసిన బహిష్కరణ అమలులోకి రాకముందే సభ నివేదికను ఆమోదించాల్సివుంటుంది. ఐపిసి, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో మూడు కీలక బిల్లులను కూడా ఈ సెషన్‌లోనే పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. హోంశాఖ వ్యవహారాలకు సంబంధించిన స్థాయీ కమిటీ ఇప్పటికే ఈ మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన మరో కీలక బిల్లు కూడా పార్లమెంటులో పెండింగ్‌లో ఉంది. వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ ప్రతిపక్షాలు, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ల నిరసనల మధ్య పార్లమెంటు ప్రత్యేక సెషన్‌లో ఆమోదానికి రాలేదు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల పేరు మార్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ప్రధానమంత్రి ఆరోగ్య యోజన- ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల పేరులో మార్పు చోటుచేసుకుంది. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లను 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్'గా మార్చాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖ రాసినట్లు సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు.

ఛండీగఢ్‌లోని మొహలిలో జరిగిన మహాధర్నాలో ప్రసంగిస్తున్న అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) అధ్యక్షులు డాక్టర్ అశోక్ ధావలే

త్రివేండ్రంలో రాజ్‌భవన్ వద్ద కార్మిక, కర్షక సంఘాలు నిర్వహించిన ఘెరావ్‌లో ప్రసంగిస్తున్న అఖిల భారత వ్యవసాయ కార్మికుల సంఘం (ఎఐఎడబ్ల్యుయు) అధ్యక్షులు విజయరాఘవన్

దేశ వ్యాపితంగా మహా పడావ్

- గొంతెత్తిన కార్మిక, కర్షక లోకం

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

కార్మిక, రైతు సంఘాల జాతీయ ఐక్య వేదిక పిలుపు మేరకు ఆదివారం దేశ వ్యాపితంగా పలు నగరాల్లో మహా పడావ్ (రాత్రి, పగలు ధర్నా)లు మొదలయ్యాయి. సిమ్లా నుంచి చెన్నై వరకు, ఇటు కొల్‌కతా నుంచి రాంచీ వరకు రైతులు కార్మికులు పెద్దయెత్తున వీటిలో పాల్గొంటున్నారు. దేశాన్ని కాపాడాలి, జీవనోపాధి కల్పించాలి, ప్రైవేటీకరణ ఆపాలి, కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించాలి. వివాదాస్పదమైన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి, రైతుల పంటకు స్వామినాథన్ కమిషన్ సూచించిన ప్రకారం సి2 ప్లస్ 50శాతం ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలి, ధరల పెరుగుదలను అరికట్టాలి, లఖింపూర్ ఖేరి రైతుల హత్యకు ప్రధాన కారకుడైన కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించి, ప్రాసిక్యూట్ చేయాలి వంటి డిమాండ్లు మార్మోగాయి. 26, 27 తేదీల్లో రాత్రి పగలు ధర్నాలు, 28న రాజ్‌భవన్ అభియాన్ కింద రాష్ట్రాల రాజధానుల్లో ధర్నాలు, గవర్నర్ల ద్వారా ప్రధానికి డిమాండ్ల చార్టర్‌ను పంపనున్నారు. ఆగస్టు24న ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరిగిన అన్ని కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య, సంయుక్త కిసాన్ మోర్చాల జాతీయ ఐక్య వేదిక సదస్సు నవంబరు26 నుంచి 28 వరకు మహా పడావ్ నిర్వహించాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో మహాపడావ్ నుద్దేశించి ఎఐకెఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే మాట్లాడుతూ, రైతులు పండించే పంటకు కనీస మద్దతు ధర, కార్మికులకు న్యాయమైన వేతనాలు ఇవ్వాలన్న డిమాండ్లు ఈ దేశ ప్రజలకు అత్యంత ముఖ్యమైనవని అన్నారు. దేశాన్ని కాపాడాలని మూడు రోజుల పాటు కార్మికులు దేశవ్యాపితంగా పోరాడనున్నారని చెప్పారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలనన్నిటినీ రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల కనీస వేతన హక్కును హరించివేసిందని, అన్ని ఉద్యోగాలను కాంట్రాక్టు ఉద్యోగాలుగా మార్చేసి, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తోందని, మరో వైపు ప్రైవేటీకరణను యథేచ్ఛగా కొనసాగిస్తున్నదని ఆయన అన్నారు. ఈ చర్యలను ఆపాలని కార్మిక, కర్షక సంఘాల జాతీయ ఐక్య వేదిక కోరింది. పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ చేస్తూ చట్టం తెస్తామని ఏడాదిపాటు రైతులు నిర్వహించిన చారిత్రాత్మక పోరాట సందర్భంగా ప్రధాన మంత్రి ఇచ్చిన హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదని ధావలే విమర్శించారు. దేశీయ, విదేశీ కార్పొరేట్లకు దేశాన్ని బిజెపి అమ్మేస్తోందని ఆయన విమర్శించారు. మరో వైపు కులం, మతం, భాష పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యతను చీల్చేందుకు యత్నిస్తోందని, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజంపై దాడులు చేస్తోందని, రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. ఇటువంటి విచ్ఛిన్నకర చర్యలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు చేయి చేయి కలిపి పోరాడుతున్నారని ధావలే పేర్కొన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని మహాపడావ్ డిమాండ్ చేస్తోందన్నారు.

చెన్నైలో పెద్ద సంఖ్యలో మహాపడావ్‌కు హాజరైన కార్మిక, కర్షకులనుద్దేశించి ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, యుపిలోని లక్నోలో మహాపడావ్ నుద్దేశించి పి కృష్ణ ప్రసాద్, భువనేశ్వర్‌లో హన్నన్‌మొల్లా, పాట్నాలో బాదల్ సరోజ్, సిమ్లాలో ఇంద్రజిత్ సింగ్, అగర్తలాలో పబిత్రాకర్, ముంబయిలో అజిత్ నావలే మాట్లాడారు. మిగతా పట్టణాల్లోనూ మహాపడావ్‌లు ప్రారంభమైనట్లు వార్తలొస్తున్నాయి. హర్యానా, పంజాబ్ రైతులు చండీగఢ్‌లో మహాపడావ్‌కు గుంపులు గుంపులుగా ట్రాక్టర్ ట్రాలీలల్లో తరలి వస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో సెక్రటేరియట్ ఎదుట కార్మికులు, రైతులు మహాపడావ్ చేపట్టారు.

సిమ్లాలో రాష్ట్ర సచివాలయం వద్ద జరిగిన ధర్నాలో ప్రసంగిస్తున్న కార్మికోద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే రాకేష్ సింఘా

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో మహాధర్నాకు వేలాదిగా తరలివచ్చిన రైతులు, కార్మికులు

ఎఐజెఎస్‌తో సత్వర న్యాయం

- యువ న్యాయ నిపుణులకూ అవకాశం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అఖిల భారత న్యాయ సర్వీసులు (ఎఐజెఎస్) రూపకల్పన చేస్తే న్యాయ ప్రక్రియను వేగవంతం చేయడానికి అది ఒక మార్గంగా మారుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. యువ న్యాయనిపుణుల్లో ప్రతిభ, పోటీతత్వం, పారదర్శకతను పెంపొందించడానికి కూడా దోహదం చేస్తుందని ఆమె తెలిపారు. ఎఐజెఎస్‌ను ఏర్పాటు చేయాలని సూచిస్తూ దాని ప్రాధాన్యతను ఆమె వివరించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సుప్రీంకోర్టు ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో న్యాయవ్యవస్థకు ఉన్న ప్రాముఖ్యత అద్వితీయమైనది పేర్కొన్నారు. బెంచ్ అండ్ బార్‌లో అన్ని సామాజిక తరగతుల వారికి అవకాశం కల్పిస్తే సరైన న్యాయం అందించడం సాధ్యమవుతుందన్నారు. ఎఐజెఎస్ ఏర్పాటుతో మరింత మెరుగైన న్యాయాన్ని అందించేందుకు తోడ్పడుతుందన్నారు. ప్రతిభావంతమైన యువతను దీనికి ఎంపిక చేసి న్యాయమూర్తులుగా తీర్చి దిద్దవచ్చునని తెలిపారు. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు యువ న్యాయవేత్తల ప్రతిభను పెంపొందించగలదని ఆమె పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు ప్రజల కోర్టు : జస్టిస్ చంద్రచూడ్

గత ఏడు దశాబ్దాలుగా సుప్రీంకోర్టు 'ప్రజల కోర్టు'గా వ్యవహరిస్తోందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ అన్నారు. ప్రజలు కోర్టుకు వెళ్లడానికి ఏమాత్రం భయపడొద్దని సూచించారు. వ్యవస్థాపిత ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రక్రియల ద్వారా రాజకీయ వైరుధ్యాలను పరిష్కరించుకునేందుకు రాజ్యాంగం అవకాశం కల్పిస్తోందన్నారు. అదే తరహాలో అనేక భేదాభిప్రాయాలను పరిష్కరించేందుకు న్యాయ వ్యవస్థ సహాయపడుతుందని తెలిపారు. గత 70 ఏళ్లలో వేల మంది పౌరులు సుప్రీం కోర్టు తలుపుతట్టారని గుర్తుచేశారు. న్యాయం జరుగుతుందనే నమ్మకంతోనే వారు సర్వోన్నత న్యాయ వ్యవస్థను ఆశ్రయించారని తెలిపారు. అక్రమ అరెస్టుల్లో జవాబుదారీతనం, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ, నిర్బంధ కార్మికుల హక్కులు, సామాజిక రుగ్మతల నిర్మూలన, గిరిజన భూముల హక్కులు.. ఇలా వివిధ అంశాల కోసం సామాన్య పౌరులు కోర్టును ఆశ్రయించారని చంద్రచూడ్ వివరించారు. ఈ ఉదంతాలన్నీ కేవలం కోర్టు గణాంకాల్లో సమాచారం మాత్రమే కాదన్నారు. సుప్రీంకోర్టుపై ప్రజలకు ఉన్న అంచనాలను ఇవి ప్రతిబింబిస్తాయని వివరించారు. తీర్పుల ద్వారా న్యాయాన్ని అందించడమే కాకుండా.. పౌర కేంద్రీకృత విధానాల రూపకల్పనకూ సుప్రీంకోర్టు నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ మేఘవాల్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆదిష్ సి అగర్వాలా పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో ఆదివారం జరిగిన 'రాజ్యాంగ దినోత్సవ' వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జ్ఞాపికగా అంబేద్కర్ విగ్రహాన్ని అందజేస్తున్న భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్

అమెరికా యుద్ధనౌకను తరిమికొట్టిన చైనా

బీజింగ్ : చైనా ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా చొరబడిన అమెరికా యుద్ధనౌకను తరిమికొట్టినట్లు చైనా సైన్యం ప్రకటించింది. చైనా-అమెరికా మధ్య శిఖరాగ్ర సదస్సు ముగిసిన కొన్ని రోజుల్లో అమెరికా కయ్యానికి కాలుదువ్వే చర్యలకు పాల్పడటం గమనార్హం. అమెరికా యుద్ధ నౌకను దక్షిణ చైనా సముద్రం నుంచి తరిమేశామని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వెల్లడించింది. ఈ మేరకు 'విచాట్'లో ఆదివారం పోస్టు చేసింది. అయితే దక్షిణ చైనా సముద్రంలో పరాసల్ ద్వీపాల వద్ద అంతర్జాతీయ జలాల్లో తమకు నౌకాయాన హక్కు ఉదంటూ అమెరికా బుకాయిస్తోంది. ఈ ప్రాంతంలో డెస్ట్రాయర్ హాప్పర్ యుద్ధ నౌకను మోహరించేందుకు అది చేసిన కుయుక్తులను చైనా తిప్పికొట్టింది. గత వారం అమెరికా డెస్ట్రాయర్ యూఎస్ఎస్ హాప్పర్ దక్షిణ చైనా జలాల్లోకి ప్రవేశించిందని, దీంతో తమ యుద్ధనౌకలు, వాయుసేన విమానాలు రంగంలోకి దిగి హాప్పర్‌ను ఆ జలాల నుంచి బయటకు పంపినట్లు చైనా సైన్యం పేర్కొంది. అంతేకాదు.. దక్షిణ చైనా సముద్రంలో అమెరికా భద్రతా పరమైన సమస్యలు సృష్టిస్తోందని తెలిపింది. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని ఫిలిప్పీన్స్ విదేశీ బలగాలను చేర్చుకొంటోందని విమర్శించింది. ఇటీవలే ఫిలిప్పీన్స్-అమెరికా దళాలు ఇక్కడ సంయుక్త గస్తీ నిర్వహించడంపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

అవి సాధారణ శ్వాసకోశ సమస్యలే

- కొత్త వైరస్ ఏదీ లేదు
- ప్రపంచ ఆరోగ్య సంస్థకు చైనా స్పష్టీకరణ

బీజింగ్/జెనివా : ఉత్తర చైనాలో చిన్నారుల్లో వేగంగా విజృంభిస్తోందన్న శ్వాసకోశ సంబంధిత వ్యాధి సాధారణమైనదేనని ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కొత్త వైరస్ చైనాలో విస్తరిస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) వివరాలు కోరగా..బీజింగ్ స్పందించింది. చైనాలో నిమోనియా విజృంభనపై తమకు నివేదిక అందిందని డబ్ల్యుహెచ్ఒ నిర్ధారించింది. శీతాకాలంలో వచ్చే సాధారణ శ్వాసకోశ సమస్యలే అని బీజింగ్ ఆ నివేదికలో స్పష్టంచేసిందని డబ్ల్యుహెచ్ఒ తెలిపింది. బాధితుల్లో ఎటువంటి కొత్త వైరస్ లేదని పేర్కొంది. ఈ విషయాన్ని చైనా స్థానిక మీడియా కూడా ధ్రువీకరించింది. చైనాలో శరవేగంగా వ్యాపించిన శ్వాసకోశ సమస్యలపై ప్రపంచ ఆరోగ్య సంస్థకు కేవలం 24 గంటల్లోనే కచ్చితమైన సమాచారం అందించిందని సిజిటిఎన్ వార్తా సంస్థ తెలిపింది. బీజింగ్, లియోనోంగ్‌లో చేసిన పరీక్షల్లో ఎటువంటి కొత్త వైరస్‌ను గుర్తించలేదని పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గురువారం చైనీస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్‌ను సంప్రదించింది. బీజింగ్ పిల్లల ఆస్పత్రిని కూడా సమాచారం కోరింది. దీనిపై ఆస్పత్రి శ్వాసకోశ విభాగం డైరెక్టర్ ఝావో షన్నియింగ్ మాట్లాడుతూ.. 'మేము సిడిసి నుంచి పొందిన డేటా ప్రకారం మైకోప్లాస్మాలో ఎటువంటి మార్పు లేదు. రోగులకు చికిత్సలో సంక్లిష్టతలు ఏమీ రాలేదు. మైకోప్లాస్మా నిమోనియా చైనాలో చాలా ఏళ్ల నుంచి ఉనికిలో ఉంది. దీనికి కచ్చితమైన రోగ నిర్ధారణ లేదు. కానీ, మాకు ఈ చికిత్సలో చాలా అనుభవం ఉంది. ప్రారంభ దశలోనే చికిత్సను అందిస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదు' అని పేర్కొన్నారు.

మలేషియాకు వీసా అక్కర్లేదు !

- డిసెంబర్ 1 నుంచి అమల్లోకి

కౌలాలంపూర్ : భారత్, చైనా నుంచి వచ్చే పర్యాటకులకు వీసా లేకుండానే తమ దేశంలోని పర్యాటక ప్రదేశాల సందర్శనకు అనుమతిస్తున్నట్లు మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం తెలిపారు. జస్టిస్ పార్టీ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడుల్ని, పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మలేషియా ఆర్థికంగా ముందుకెళ్లాలంటే పర్యాటక రంగ అభివృద్ధి ముఖ్యం ఆయన చెప్పారు. ఇందులో భాగంగానే చైనా, భారత్ పౌరులకు వీసా లేకుండానే తమ దేశంలో పర్యటించేందుకు అనుమతులిస్తామని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి చైనా, భారతీయ పౌరులు వీసా లేకుండా మలేషియాలో పర్యటించే వీలుంటుందన్నారు. తమ దేశంలోకి ప్రవేశించినప్పటి నుంచి 30 రోజుల పాటు వీసా లేకుండా ఉండొచ్చని ఆయన తెలిపారు. కాగా భారతీయులకు వీసా అవసరం లేకుండానే పర్యటించే సౌలభ్యాన్ని ఇటీవల థాయిలాండ్, శ్రీలంక ప్రభుత్వాలు కూడా కల్పించిన సంగతి విదితమే.

ఉత్తరప్రదేశ్‌లో ఉపాధ్యాయ అభ్యర్థులపై ఉక్కుపాదం

- టీచర్ పోస్టుల భర్తీ కోసం బిజెపి ఆఫీస్ ముట్టడించిన యువత
- బలవంతంగా లాగిపడేసిన పోలీసులు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఉపాధ్యాయ అభ్యర్థులపై అక్కడి బిజెపి ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. టీచర్ పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్‌తో బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని వందలాది మంది అభ్యర్థులు ముట్టడించారు. కార్యాలయం లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో అభ్యర్థులపై పోలీసుల్ని బిజెపి ప్రభుత్వం ప్రయోగించింది. అభ్యర్థులపై పోలీసులు కనికరం లేకుండా దాడి చేశారు. బలవంతంగా బయటకు లాగి పడేశారు. అనేక మందిని అరెస్టు చేసి ఎకో గార్డెన్ పార్కుకు తరలించారు. బిజెపి కార్యకర్తలు కూడా టీచర్ అభ్యర్థులపై దాడి చేశారు. 69 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రారంభించిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఖాళీలను భర్తీ చేయాలనే డిమాండ్‌తో కొన్ని నెలల నుంచి ఉపాధ్యాయ అభ్యర్థులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ డైరెక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నివాసం వద్ద కూడా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అయినా ప్రభుత్వంలో చలనం లేదు. 2020 జూన్‌లో 69 వేల మందితో కూడిన టీచర్ల మెరిట్‌ను విడుదల చేశారు. దీనిపై అనేక పిటీషన్లు దాఖలయ్యాయి. దీంతో 6,800 మంది రిజర్వ్‌డ్ కేటగిరి అభ్యర్థులతో కూడిన ఒక మెరిట్ జాబితాను ఈ ఏడాది మార్చిలో అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ రద్దు చేసింది. మొత్తం మెరిట్ జాబితాను పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ప్రభుత్వం ఈ పని చేయడం లేదు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు భూపేంద్ర సింగ్ చౌదరిని కలవడానికి బిజెపి కార్యాలయానికి చేరుకున్నామని, అయితే బిజెపి కార్యకర్తలు, పోలీసులు తమపై దాడి చేశారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మా డిమాండ్లను నెరవేర్చకపోతే రాష్ట్ర అసెంబ్లీ వద్ద మేం ధర్నా నిర్వహించాల్సి ఉంటుందని అభ్యర్థులు హెచ్చరించారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

- కాల్పుల్లో కుకీ-జో గిరిజనుడు మృతి

గౌహతి: మణిపూర్‌లో హింసాత్మక అల్లర్లు తగ్గుముఖం పట్టటం లేదు. అక్కడ మళ్లీ హింస చెలరేగింది. రెండు గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో కుకీ-జో అనే గిరిజనుడు (21) మరణించాడు. ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ (ఐటీఎల్ఎఫ్) మతుడిని ఫైఖోలం గ్రామానికి చెందిన ఖుప్మింతంగ్‌గా గుర్తించింది. అతను గ్రామ వాలంటీర్ అని గిరిజన సంస్థ తెలిపింది. ఇంఫాల్ లోయలోని బిష్ణుపూర్ జిల్లా సరిహద్దులో ఉన్న కాంగ్‌పోక్పి జిల్లాలోని కుకి-జో గ్రామమైన జూపి వద్ద కాల్పులు జరిగాయి. దుండగులు అత్యాధునిక ఆయుధాలతో కాల్పులు జరిపారనీ, అయితే కుకీ-జో గ్రామ వాలంటీర్లు సింగిల్ బ్యారెల్ రైఫిల్స్‌తో గ్రామాన్ని రక్షించేందుకు తమ వంతుగా నిలబడ్డారని ఐటీఎల్ఎఫ్ తెలిపింది. ఈ సంఘటన తర్వాత కాంగ్‌పోక్పి-బిష్ణుపూర్ సరిహద్దుకు ఇరువైపులా ఉన్న గ్రామస్థులు మరింత దాడులు, ప్రతిదాడులను చేయటంతో అక్కడ ఉద్రిక్తత నెలకొన్నది.

అతిపెద్ద పులుల అభయారణ్యం ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద పులుల అభయారణ్యం (టైగర్ రిజర్వు) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం పచ్చజెండా ఊపింఇ. సుమారు 2300 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఈ రిజర్వు ఏర్పాటు కానుంది. ఇందుకోసం మధ్యప్రదేశ్ లోని నౌరదేహి వన్యప్రాణి అభయారణ్యం (నౌరాదేహి విల్డ్‌లైఫ్ శాంక్చురీ), రాణి దుర్గావతి వన్యప్రాణి అభ్యయారణ్యాలను కలిపివేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఆమోదం తెలిపింది. ఈ రెండు వన్యప్రాణి అభయారణ్యాలు సాగర్, దమోహ్, నర్సింగ్‌పుర్, రైసెన్ జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ వల్ల దేశంలో పెద్ద పులుల సంఖ్య పెరగడంతోపాటు, స్థానికంగా పర్యాటక రంగం మరింత అభివద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. మూడు నెలల్లో దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు దమోహ్ డివిజన్ అటవీ శాఖ అధికారి ఎంఎస్ ఉకెయ్ తెలిపారు.

రాజ్యాంగంపై సోషల్ ఆడిట్ జరగాలి

- తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై : రాజ్యాంగంపై సోషల్ ఆడిట్ జరగాలని, దానికి ఇదే సరైన సమయమని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తెలిపారు. దేశ రాజ్యాంగాన్ని కేవలం ఒక లీగల్ డాక్యుమెంట్ లేదా చట్టపరమైన వ్యక్తుల విశేషాధికారం అనుకునే స్థాయికి తగ్గించకూడదని గవర్నర్ అన్నారు. 'రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంత వరకూ నెరవేర్చింది. ఎందుకు నెరవేర్చలేకపోయింది. దీనిని తనిఖీ చేయడానికి సోషల్ ఆడిట్ జరగాలి' అని గవర్నర్ తెలిపారు. రాజ్యంగ దినోత్సవం సందర్భంగా తమిళనాడు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్శిటీ వద్ద జరిగిన ఒకరోజు కన్సార్టియంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యంగం రూపకల్పనకు దాని నిర్మాతలు ఎంతో కష్టపడ్డారని, ఈ విషయంలో అంబేద్కర్ సారథ్యంలోని రాజ్యాంగ పరిషత్‌కు కృతజ్ఞులమై ఉండాలని చెప్పారు. అయితే ఇది సంపూర్ణ పత్రం కాదనే వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. రవి చేసిన వ్యాఖ్యలను పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి నారాయణ స్వామి తప్పుబట్టారు. దేశ రాజ్యాంగంపై సోషల్ ఆడిట్ జరగాలన్న రవి వ్యాఖ్యలు అభ్యంతరకరమన్నారు. ఈ వ్యాఖ్యలు రాజ్యాంగ నిర్మాతలను అవమానించడమేనని విమర్శించారు. గవర్నర్ పదవికి రవి అర్హుడు కాదని అన్నారు.

గవర్నర్ తిరస్కరిస్తే ఆయుష్షు తీరినట్లు కాదు

- బిల్లులపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ : రాష్ట్ర గవర్నర్ ఏదైనా బిల్లును తిరస్కరిస్తే దానిని ఆయుష్షు తీరినట్లుగా భావించరాదని సుప్రీంకోర్టు తన 27 పేజీల తీర్పులో వ్యాఖ్యానించింది. శాసనసభ ఆమోదించిన బిల్లుల్ని గవర్నర్ తిరస్కరించడం లేదా ఆమోదించకుండా తన వద్ద అట్టే పెట్టుకోవడాన్ని తప్పుపడుతూ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై త్రిసభ్య బెంచ్ తరపున ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ తీర్పు రాశారు. ఇందులో గవర్నర్ల పాత్రపై పలు కీలక వ్యాఖ్యలు ఉన్నాయి.

తన వద్దకు వచ్చిన బిల్లులకు సంబంధించి గవర్నర్ తీసుకోవాల్సిన మూడు చర్యలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 స్పష్టంగా నిర్దేశించిందని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లును ఆమోదించడం, ఆమోదించకుండా అట్టే పెట్టడం, లేదా పార్లమెంట్ పరిశీలనకు బిల్లును రిజర్వ్ చేయడం మినహా గవర్నర్‌కు వేరే ప్రత్యామ్నాయం ఉండదు. ద్రవ్య బిల్లు మినహా ఇతర బిల్లుల్ని గవర్నర్ ఆమోదించకుండా తన వద్దే ఉంచుకున్న పక్షంలో దానిని సాధ్యమైనంత త్వరగా శాసనసభకు తిప్పి పంపాలి. వాటిలో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సందేశం పంపవచ్చు. లేదా బిల్లును కానీ, అందులోని నిబంధనల్ని కానీ తిరిగి పరిశీలించాల్సిందిగా కోరవచ్చు. బిల్లును తిరస్కరించిన తర్వాత దానంతట అదే జీవం కోల్పోయేలా చేయడం, మరోసారి ఆమోదం కోసం శాసనసభకు పంపడం... ఈ రెండింటి మధ్య గవర్నర్ వేరే అవకాశాన్ని ఎంచుకోరాదని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది.

ఏదైనా బిల్లును ఆమోదించరాదని గవర్నర్ నిర్ణయించుకున్నప్పుడు దానిని విధిగా శాసనసభకు తప్పి పంపాల్సి ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఏదేమైనా బిల్లులపై అంతిమ నిర్ణయం రాష్ట్ర శాసనసభదే కానీ గవర్నరుది కాదని తేల్చి చెప్పారు. దీనర్థం గవర్నర్ తిప్పి పంపిన బిల్లును ఎలాంటి సవరణలు చేయకుండా శాసనసభ మరోసారి ఆమోదిస్తే దానికి ఓకే చెప్పడం మినహా గవర్నరుకు మరో ప్రత్యామ్నాయం లేదు. 'గవర్నర్ ప్రజలు ఎన్నుకోని రాష్ట్ర ప్రభుత్వ అధిపతి. ప్రజలు ఎన్నుకున్న శాసనసభ ఏదైనా ఓ తీర్మానం చేస్తే దానిని వీటో చేసే స్థితిలో గవర్నర్ ఉండవచ్చు. దానిని ఆమోదించడం లేదని తేలిగ్గా చెప్పవచ్చు. అయితే అలాంటి చర్య పార్లమెంటరీ పాలనా వ్యవస్థపై ఆధారపడిన ప్రజాస్వామిక ప్రాథమిక సూత్రాలకు భిన్నంగా ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 168 ప్రకారం గవర్నర్ శాసన వ్యవస్థలో ఓ భాగం. రాజ్యాంగబద్ధమైన పాలనకు గవర్నర్ కట్టుబడి ఉండాలి' అని సుప్రీంకోర్టు తన తీర్పులో వివరించింది.

మీ కోసం

ఉల్లిపాయలను సగానికి కట్‌చేసి పది నిమిషాల పాటు నీళ్లలో ఉంచి, ఆ తర్వాత తరిగితే కళ్ళు మండకుండా ఉంటాయి.

జీవన సౌరభం

నిరంతరం శ్రమించేవాణ్ని చూసి ఓటమి భయపడుతుంది.

ప్రోత్సాహం



పుట్టింట్లో ఓ వారం రోజులు గడిపి వెళ్దామని రామాపురం నుంచి రవీ, రజనీ వాళ్ళ అత్తయ్య సుభద్ర వచ్చింది. రవీ, రజనీ చాలా చురుకైన పిల్లలు. వాళ్లిద్దరూ అంటే సుభద్రకు ప్రాణం. కానీ, తాను వచ్చిన దగ్గర నుండీ తన అన్నా, వదినా దేనికో దానికి ఆ పిల్లలను కసురుకోవడం గమనించి చాలా బాధపడింది.

ఆ రోజు.. 'నాన్నా మా బడిలో వార్షికోత్సవం సందర్భంగా పోటీలు పెడ్తున్నారు. నాకు ఉపన్యాస పోటీలో పాల్గొనాలని ఉంది' అని చెప్పారు పిల్లలు. 'ఒరే రవీ... నీకసలే మొహమాటం ఎక్కువ. ఇక నువ్వేం మాట్లాడుతావు?' అని కసిరాడు రవి తండ్రి రఘుపతి. 'రజనీ నువ్వు వట్టి పిరికి గొడ్డువి. అక్కడ న్యాయ నిర్ణేతలను చూసి జడుసుకుని నీకు నోట మాట కూడా రాదు. ఇక నువ్వేం పోటీలో పాల్గొంటావు?' అన్నది తల్లి సావిత్రి.

పిల్లలిద్దరూ చాలా నిరాశపడి ముడుచుకుపోయారు. అది గమనించిన సుభద్ర ఆ సాయంత్రం పిల్లలిద్దరినీ తన దగ్గర కూర్చో బెట్టుకున్నది. వాళ్ళ ఆసక్తులు ఏమిటో, వాళ్ళ ప్రతిభ ఏమిటో, దేనికి భయపడ్తున్నారో, దేనికీ సిగ్గుపడ్తున్నారో గమనించింది.

'పిల్లలూ! ఏదైనా విషయం పట్ల మనకు పూర్తి అవగాహన లేనప్పుడు మనలో కొన్ని అనుమానాలు, భయాలు చోటు చేసుకుంటాయి. మీరు చిన్న పిల్లలు. మీకు అన్ని విషయాలు తెలియకపోవచ్చు. తెలియని విషయం తెలియదని ఒప్పేసుకుని, తెలియాల్సిన విషయాలను తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ఏ విషయం పట్ల అయినా మనకు స్పష్టమైన అవగాహన ఉంటే మనలోని అనుమానాలు, భయాలు మటుమాయం అవుతాయి. మీరేమీ భయపడకండి. మీరు ఎలా ఉపన్యసించాలో నేను చెప్తాను' అని ప్రోత్సహించింది.

'ఉపన్యాస పోటీలో కేవలం మీరు చెప్పే అంశానికే కాదు, మీరు నిల్చున్న తీరుకు, మీరు వాడిన భాషకు కూడా మార్కులుంటాయి. మీరు మీ భావాలను వ్యక్తీకరించే తీరును కూడా న్యాయనిర్ణేతలు గమనిస్తారు. అసలు ఇలా ఉపన్యాస పోటీలు ఎందుకు పెడతారో తెలుసా? భవిష్యత్తులో మీరు ఎప్పుడు, ఎవరితో, ఎక్కడ ఏమి మాట్లాడాలన్నా ధైర్యంగా మాట్లాడానికే' అని చెప్పింది. వాళ్ళు మాట్లాడాల్సిన అంశం గురించిన వివిధ అంశాలు వివరించింది.

'ఇంకో విషయం గుర్తుంచుకొండి. ఏ పోటీలోనైనా యాభైమంది పాల్గొన్నా, వందమంది మాట్లాడినా ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహ బహుమతులు మాత్రమే ఉంటాయి. పోటీలో మనం పాల్గొనడం, బహుమతి కోసం కృషి చెయ్యడం ముఖ్యం. బహుమతి వస్తే సంతోషమే. రాకపోతే మాత్రం కుంగిపోకూడదు. నలుగురిలో ధైర్యంగా నిలబడి ఎలా మాట్లాడాలో అనుభవం వస్తుంది. ఆ అనుభవంతో ఈసారి మరో పోటీ పెట్టినప్పుడు ధైర్యంగా పాల్గొనవచ్చు. సరేనా?' అన్నది సుభద్ర.

మర్నాడు పిల్లలిద్దరూ పోటీలో పాల్గొడానికి ఉత్సాహంగా సిద్ధమయ్యారు. పెద్దలు, పిల్లలను ఏ రకంగా ప్రోత్సహించాలో అర్థమైన రఘుపతి, సావిత్రి పిల్లలను తీసుకుని బడిలో దింపిరావడానికి బయలుదేరారు.

- సమ్మెట ఉమాదేవి

నేను గీసిన బొమ్మ

పూర్ణిమ,
9వ తరగతి,
శ్రీసాయి ఎపెక్స్
ఎస్‌సిహెచ్‌ఎల్,
మంగళగిరి,
గుంటూరు జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

14 ఏళ్ల అన్నపూర్ణ అధ్యయనం మార్పుకు నాంది

ఒక్కోసారి పిల్లలు చేసే పనులు మనల్ని ఆశ్చర్యానికి, ఆనందానికి గురిచేస్తుంటాయి. ముఖ్యంగా సైన్స్ కాంగ్రెస్ వంటి ప్రదర్శనల్లో పిల్లల ప్రతిభ చూసి నోరెళ్లబెడతాం. రైతులకు ఉపయోగపడే పరికరాల దగ్గర నుండి సెల్‌ఫోన్ల చార్జింగ్‌లు, మోటారు బైక్‌ల మరమ్మతులు, అంధులకు, విభిన్న ప్రతిభావంతులకు ఉపయోగపడే పరికరాలు ... ఇలా ప్రతి ఒక్క అంశంపై బాల మేధావులు ఎన్నో ఆవిష్కరణలను మన ముందుంచుతారు. అలా ఒడిశాకు చెందిన 14 ఏళ్ల అన్నపూర్ణ పరిదా చేసిన ఓ సర్వే తనను ప్రత్యేకంగా నిలిపింది. తను చేసిన అధ్యయనం ప్రతిష్టాత్మక బాలల జాతీయ కాంగ్రెస్‌కు ఎంపికయ్యేలా చేసింది.

ఒరిస్సా పురోహిత్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అన్నపూర్ణ, పంట మార్పిడి, పప్పుధాన్యాల సాగుపై అధ్యయనం చేసింది. ఇందుకోసం ఎంతోమంది రైతులను ప్రత్యక్షంగా కలిసింది. వారికి అవగాహన కల్పించింది. పప్పుధాన్యాల సాగు వల్ల నేలలో నత్రజని స్థాయి పెరుగుతుందని, తద్వారా రోగాల బారిన పడకుండా ఉంటారని వారికి అర్థమయ్యేలా చెప్పింది. అన్నపూర్ణ ఈ విషయాలు చెప్పేవరకు చాలామంది రైతులకు దీనిపై అవగాహన లేదు. దీంతో ప్రత్యక్షంగా వారికి అవగాహన కల్పించాలని జగత్సింగపూర్ బ్లాక్‌లోని తర్డ్‌పడా పంచాయతి, చందురా గ్రామాన్ని తన అధ్యయనానికి కేంద్రంగా ఎంచుకుంది. అక్కడ 160 మంది రైతులను కలిసింది. అన్ని వయసుల వారితో మాటామంతి కలిపింది. పంట మార్పిడి, పప్పుధాన్యాల సాగు, శాస్త్రీయ పద్ధతుల్లో పంట సాగు, భూసార పరీక్షలు వంటి వాటిపై వారి ఆలోచనలను పంచుకుంది. అక్కడ ఉన్న భూమిలో కేవలం 33 శాతం భాగంలోనే పప్పుధాన్యాల సాగు జరుగుతుందని గ్రహించింది. అలాగే మొత్తం రైతుల్లో 40 శాతం మంది రైతులు పప్పుధాన్యాల సాగు చేస్తుంటే వారిలో అత్యధికులకు పంటమార్పిడి, భూసార పరీక్షల్లో అవగాహన కొరవడింది.

రైతుల అవగాహనా లేమి అక్కడి సాగులో స్పష్టంగా కనిపించింది. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నా రైతులు అటువైపు దృష్టిసారించడం లేదని గుర్తించిన అన్నపూర్ణ, ఆ రైతులకు కేవలం అవగాహన కల్పించడం వరకే సరిపెట్టకుండా, నాణ్యమైన పంట ఉత్పత్తి, భూసార పరీక్షలు, సారవంతమైన భూమి కోసం పంటమార్పిడి పద్ధతులను అనుసరించేలా వారిని సంసిద్ధులను చేసింది. ఈ మొత్తం అధ్యయనాన్ని రాష్ట్ర బాలల సైన్స్ కాంగ్రెస్‌లో వివరించింది.

14 ఏళ్ల బాలిక పంట ఉత్పత్తులు, పంట సాగు, భూసార పరీక్షలు, మానవుల ఆరోగ్యంపై ఇంతటి పరిశోధన చేసిందని అక్కడికి వచ్చిన వారంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. తన విశ్లేషణ, అధ్యయనానికి ముగ్ధులై ఆమెను డిసెంబరు 27న జరిగే జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక చేశారు.

చిన్న వయసులోనే అన్నపూర్ణ ఇంత పెద్ద విషయంపై అధ్యయనం చెయ్యడానికి తన కుటుంబం, టీచర్ల ప్రోత్సాహం ఎంతో ఉంది. అన్నపూర్ణ తల్లి కవితా సాహూ స్కూల్ టీచర్, తండ్రి రవినారాయణ్ పరిదా ఎలక్ట్రీషియన్. సైన్స్ టీచర్ అంజన్ కుమార్ సాహూ తనను ఈ అధ్యయనం చేసేలా ఎంతో ప్రోత్సహించారని అన్నపూర్ణ ఆ సభలో చెప్పింది. సరైన ప్రోత్సాహం ఇస్తే పిల్లలు ఎన్నో అద్భుతాలు చేయగలరని నిరూపించిన అన్నపూర్ణ ఎంతోమంది చిన్నారులకు మార్గదర్శకం.

చలికాలం.. పిల్లలు, వృద్ధుల సంరక్షణ ఇలా...

చలికాలంలో తక్కువ ఉష్ణోగ్రతలు ఉండడం వల్ల పిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్లూ, ఇతర శీతాకాల సంబంధిత సమస్యల నుండి వారిని రక్షించుకోవాలి.

ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించాలి

వృద్ధులు, ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు చలికి ఎక్కువగా ప్రభావితమౌతారు. కాబట్టి ఇంట్లో ఎయిర్ కండీషనర్ ఉన్నవాళ్లు వింటర్ మోడ్‌కు సర్దుబాటు చేసుకోవాలి. గదులు ఎల్లప్పుడూ వెచ్చగా ఉండేలా చూడాలి. ఉష్ణోగ్రతలు తగ్గుతున్నప్పుడు కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి.

పడిపోయే ప్రమాదాన్ని గుర్తించండి, నివారించండి

చలికి రక్షణగా వృద్ధులు ఇంట్లో మేజోళ్ళు, చెప్పులు ధరిస్తారు. అవి కొన్ని సార్లు జారుడు స్వభావాన్ని కలిగి ఉంటాయి. దీని వల్ల నేలపై లేదా మెట్ల మీద పడే ఆస్కారం ఉంటుంది. దీనిని నివారించాలంటే, బలమైన పట్టును కలిగి ఉండే బూట్లు, చెప్పులు మాత్రమే ధరించాలి. అలాగే నేల (ఫ్లోర్) ఎల్లప్పుడూ పొడిగా ఉండేలా చూడాలి.

దుస్తుల ఎంపికలో జాగ్రత్తలు

పిల్లలు ఎప్పుడూ గాలి, వాటర్ ప్రూఫ్‌తో కూడిన దుస్తులు ధరించేలా చూడాలి. బయటకు వెళ్లినప్పుడల్లా ఉన్ని దుస్తులను ధరించమని చెప్పాలి. వృద్ధులు థర్మోకోట్ ధరించవచ్చు. ఇది వారి శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది. అలాగే ముఖం, చేతులు, చెవులు, మెడను రక్షించుకోవడానికి ఎల్లప్పుడూ చేతి తొడుగులు, స్కార్ఫ్‌లు, మంకీ క్యాప్‌లను ధరించాలి.

భద్రతపై అశ్రద్ధ వద్దు

చలికాలంలో ముఖ్యంగా కాస్త పెద్ద పిల్లలు ఆడుకోవడానికి బయటకు వెళ్లినప్పుడు, రోడ్డుపై మంచు పడడం వల్ల వాహనం టైర్లు స్కిడ్ అయ్యే ప్రమాదముంటుంది. ఇలాంటి సందర్భాల్లో వారిని రక్షించడానికి వీలుగా హెల్మెట్, మణికట్టు, మోచేయి, మోకాలికి గార్డులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

పోషణపై శ్రద్ధ అవసరం

శీతాకాలంలో వృద్ధులు, పిల్లలు ఇద్దరికీ విటమిన్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం ఇవ్వాలి. డ్రై ఫ్రూట్స్, ముక్కలు చేసిన పచ్చి కూరగాయలు, పెరుగు తరచూ తీసుకునేలా చూడాలి. ఇవి వారి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి.

హైడ్రేటెడ్‌గా ఉంచాలి

చలికాలంలో చెమట పట్టదు. దీంతో పిల్లలు తగినంత నీళ్లు తాగక డీహైడ్రేషన్‌కు గురవుతారు. దీనిని నివారించడానికి విటమిన్ సి అధికంగా ఉండే తక్కువ - చక్కెర రసాలను వారికి అందిస్తూ ఉండాలి. ఇవి వారి శరీరం హైడ్రేటెడ్‌గా ఉంచడానికి తోడ్పడుతుంది. దాంతో పాటు వేడి పానీయాలు కూడా మంచి ఫలితాలనిస్తాయి.

ధనాధన్ మోత

- రెండో టీ20లో భారత్ గెలుపు
- యశస్వి, గైక్వాడ్, కిషన్ అర్ధ సెంచరీలు
- భారత్ స్కోరు 235/4
- చేధనలో చతికిలపడ్డ ఆసీస్

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ యశస్వి జైస్వాల్ (53)

తిరువనంతపురం: భారత్ అదరగొట్టింది. ఆస్ట్రేలియాతో ఆదివారం ఇక్కడ జరిగిన రెండో టీ20లో 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటర్లు చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో టీమ్‌ఇండియా 4 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో ఆసీస్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 191 పరుగులు మాత్రమే చేసింది. టాప్ ఆర్డర్‌లో స్టీవ్ స్మిత్ (19), మాథ్యూ షార్ట్ (19), జోష్ ఇంగ్లిస్ (2), మ్యాక్స్‌వెల్ (12) విఫలయ్యారు. తర్వాత వచ్చిన మార్కస్ స్టొయినిస్ (45 పరుగులు, 25 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (37 పరుగులు, 22 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. వీరిద్దరూ స్వల్పవ్యవధిలో ఔటయ్యారు. చివర్లో మాథ్యూ వేడ్(42 పరుగులు, 23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) పోరాడినా అప్పటికే ఆసీస్ ఓటమి ఖరారైపోయింది. భారత బౌలర్లలో రవి బిష్ణోయ్ 3, ప్రసిద్ధ్ కృష్ణ 3, అక్షర్ పటేల్, ముకేశ్ కుమార్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌లో ఈ టీ20 సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మూడో టీ20 ఈ నెల 28న గౌహతిలో జరగనుంది. ఆదివారం మ్యాచ్‌లో ఇరు జట్లు మొత్తంగా 426 పరుగులు చేశాయి. భారత్-ఆస్ట్రేలియా మధ్య టీ20ల్లో ఇరు జట్లు కలిపి చేసిన స్కోరులో ఇదే అత్యధికం. అలాగే ఆదివారం మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో పదో వికెట్‌కు మాథ్యు వేడ్- టి సంఘ జోడీ 36 పరుగులు జోడించింది. ఆస్టేలియా తరపున టీ20ల్లో పదో వికెట్‌కు ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం.

ఆదివారం మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్ బ్యాటర్లు చెలరేగారు. స్వింగ్‌కు అనుకూలించే పరిస్థితుల్లో తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియా.. పరుగుల వరద పారించింది. టాప్-3 బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (53, 25 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (58, 43 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (52, 32 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో మెరవటంతో భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 235 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. రింకూ సింగ్ (31 నాటౌట్, 9 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అదిరే ముగింపు అందించాడు.

పరుగుల వరద : తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (53) అదిరే ఆరంభం అందించాడు. స్వింగ్ లభించిన పిచ్‌పై ఆరంభంలో వికెట్లు ఆశించిన ఆసీస్‌కు జైస్వాల్ భంగపాటే మిగిల్చాడు. సీన్ అబాట్ ఓవర్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో విశ్వరూపం చూపించిన జైస్వాల్.. 24 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. జైస్వాల్ జోరుతో భారత్ 3.5 ఓవర్లలోనే 50 పరుగుల మార్క్ దాటింది. జైస్వాల్ నిష్క్రమించినా.. మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (58) జతగా ఇషాన్ కిషన్ (52) రెచ్చిపోయాడు. గైక్వాడ్ స్ట్రయిక్ రొటేట్ చేయగా.. కిషన్ సిక్సర్ల వర్షం కురిపించాడు. కిషన్ 29 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించగా, గైక్వాడ్ 39 బంతుల్లో కొట్టాడు. సూర్య కుమార్ (19) తొలి బంతినే సిక్సర్‌గా మలిచి జోరు కొనసాగించగా.. ఇన్నింగ్స్‌కు రింకూ సింగ్ (31 నాటౌట్) అదిరే ముగింపు అందించాడు. అబాట్ వేసిన ఓవర్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు కొట్టి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. చివర్లో తెలుగు తేజం తిలక్ వర్మ (7 నాటౌట్) సైతం ఓ సిక్సర్‌తో మెరిశాడు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎలిస్ (3/45) మూడు వికెట్లు పడగొట్టాడు.

బ్రూక్ భారం దింపేశారు

టైటాన్స్‌తోనే హార్దిక్ పాండ్య • మరో సీజన్‌కు ధోని సిద్ధం • ఐపిఎల్ 2024 రిటెన్షన్ జాబితా

ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 2024 సందడి మొదలైంది. ఆటగాళ్ల మినీ వేలానికి ముందు ఐపిఎల్ ప్రాంఛైజీలు అట్టిపెట్టుకున్న, వదిలేసుకున్న ఆటగాళ్ల జాబితాను ఆదివారం వెల్లడించాయి. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య వచ్చే సీజన్‌కు ముంబయి ఇండియన్స్‌కు ఆడతాడనే ఊహాగానాల నడుమ.. అతడిని టైటాన్స్ నిలుపుకుంది. వేలంలో కోట్లు కుమ్మరించి దక్కించుకున్న ఇంగ్లాండ్ యువ సంచలనం హ్యారీ బ్రూక్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ వదిలేసుకుంది. బుమ్రా జతగా అరాచకం చేస్తాడనుకున్న జోఫ్రా ఆర్చర్‌ను ముంబయి ఇండియన్స్ వేలంలోకి వదిలేసింది. రిటెన్షన్, రిలీజ్ జాబితా సమర్పించేందుకు ఆదివారంతో గడువు ముగియగా.. డిసెంబర్ 19న దుబాయ్ వేదికగా ఐపిఎల్ 2024 ఆటగాళ్ల మినీ వేలం నిర్వహించనున్నారు.

బ్రూక్ అవుట్ : రూ.13.25 కోట్లు. హ్యారీ బ్రూక్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్‌లో వెచ్చించిన మొత్తం. భారీ అంచనాలతో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన బ్రూక్.. దారుణంగా విఫలమయ్యాడు. ఓ సెంచరీతో మెరిసినా.. సీజన్‌లో నిలకడ లేని ప్రదర్శనతో జట్టుకు భారమయ్యాడు. యువ బ్రూక్‌కు మరో అవకాశం ఇవ్వాలనే వాదన ఉన్నప్పటికీ.. సన్‌రైజర్స్ ఇంగ్లాండ్ స్టార్‌పై విశ్వాసం ఉంచలేదు. బ్రూక్‌ను వేలంలోకి వదిలేసింది. ఆదిల్ రషీద్, అకీల్ హొసేన్ సహా కార్తీక్ త్యాగి, సమరత్ వ్యాస్‌లను సైతం హైదరాబాద్ విడిచిపెట్టింది. రానున్న వేలంలో రూ.34 కోట్ల డబ్బుతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లను కొనుగోలు చేయనుంది.

టైటాన్స్‌తోనే హార్దిక్?! : 2015లో రూ.10 లక్షల కనీస ధరకు ముంబయి ఇండియన్స్ గూటికి చేరిన హార్దిక్ పాండ్య.. లీగ్ స్టార్‌గా ఎదిగేందుకు పెద్దగా సమయం పట్టలేదు. రెండేండ్ల క్రితం గాయంతో ఇబ్బందిపడుతున్న తరుణంలో టైటాన్స్ పాండ్యను తీసుకుని ఏకంగా కెప్టెన్సీ అప్పగించింది. కెప్టెన్‌గా అరంగేట్ర సీజన్లో టైటిల్ కొట్టిన పాండ్య.. రెండో సీజన్‌లో రన్నరప్‌గా నిలబెట్టాడు. రోహిత్ శర్మ వారసుడి అన్వేషణలో ఉన్న ముంబయి ఇండియన్స్

మళ్లీ హార్దిక్ పాండ్యను తెచ్చుకోవాలని గట్టి ప్రయత్నం చేస్తోంది. రూ.15 కోట్ల నగదుతో పాటు భారీ మొత్తంలో బదిలీ ఫీజు చెల్లించేందుకు ముంబయి ఇండియన్స్ సిద్ధమైంది. అయితే, రిటెన్షన్ జాబితా వెల్లడి సమయానికి కాంట్రాక్టు ఖరారు కాలేదని తెలిసింది. రిటెన్షన్ జాబితా వచ్చినా.. పాండ్యను తీసుకునేందుకు ముంబయికి అవకాశం ఉంది. అయితే, ఇప్పుడు నగదు బదిలీ కుదరదు. పాండ్యకు బదులుగా ముంబయి నుంచి మరో ఆటగాడిని ఎంచుకునే స్వేచ్ఛ గుజరాత్ టైటాన్స్‌కు ఇచ్చేందుకు అంబాని ప్రాంఛైజీ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఎం.ఎస్ ధోని అభిమానులకు చెన్నై సూపర్‌కింగ్స్ తీపి కబురు అందించింది. మహి మరో సీజన్‌లో నాయకుడిగా సందడి చేయనున్నాడు. అయితే, సీజన్‌కు అందుబాటులో ఉండని స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను చెన్నై వదులుకుంది. అంబటి రాయుడు రిటైర్మెంట్‌తో దూరమవగా..ప్రిటోరియస్, కైల్ జెమీసన్, ఆకాశ్ సింగ్, భగత్ వర్మలను సూపర్‌కింగ్స్ విడిచిపెట్టింది. ఇక ముంబయి ఇండియన్స్ అనూహ్యంగా జోఫ్రా ఆర్చర్‌ను వదులుకుంది. గాయంతో ఇబ్బందిపడుతున్న ఆర్చర్ ఐపీఎల్‌కు అందుబాటులో ఉండటం లేదు. దీంతో అతడితో పాటు స్టబ్స్, జాన్సెన్, రిచర్డ్‌సన్, మెరెడిత్, క్రిస్ జోర్డాన్‌లను ముంబయి వదులుకుంది.

వదులుకున్న ఆటగాళ్ల జాబితా

చెన్నై సూపర్‌కింగ్స్ : అంబటి రాయుడు, బెన్ స్టోక్స్, డ్వేన్ ప్రిటోరియస్, భగత్ వర్మ, సుభ్రాన్షు సేనాపతి, ఆకాశ్ సింగ్, కైల్ జెమీసన్, సిసండ మంగళ.

ఢిల్లీ క్యాపిటల్స్ : రిలే రొసొ, చేతన్ సకారియ, మనీశ్ పాండే, ఫిల్ సాల్ట్, ముస్తాఫిజుర్ రెహమాన్, కమలేశ్ నగరకోటి, రిపాల్ పటేల్, సర్ఫరాజ్ ఖాన్, ఆమన్ ఖాన్, ప్రియాం గార్గ్, రోవ్‌మాన్ పావెల్.

రాజస్థాన్ రాయల్స్ : జేసన్ హోల్డర్, మెక్‌కాయ్, జో రూట్, అబ్దుల్ బాసిత్, ఆకాశ్ వశిష్ట్, కుల్దీప్ యాదవ్, మురుగన్ అశ్విన్, కెసి కరియప్ప, కెఎం అసిఫ్.

పంజాబ్ కింగ్స్ : భానుక రాజపక్స, మోహిత్ రాతీ, బాల్తేజ్ దండ, రాజ్ భవ, షారుక్ ఖాన్.

కోల్‌కత నైట్‌రైడర్స్ : షకిబ్ అల్ హసన్, లిటన్ దాస్, డెవిడ్ వైసీ, ఆర్య దేశాయ్, ఎన్. జగదీశన్, మన్‌దీప్ సింగ్, కుల్వంత్ ఖెజ్రోలియ, శార్దుల్ ఠాకూర్, లాకీ ఫెర్గుసన్, ఉమేశ్ యాదవ్, టిమ్ సౌథీ, జాన్సన్ చార్లెస్.

సన్‌రైజర్స్ హైదరాబాద్ : హ్యారీ బ్రూక్, సమరత్ వ్యాస్, కార్తీక్ త్యాగి, విబ్రాంత్ శర్మ, అకీల్ హొసేన్, ఆదిల్ రషీద్.

లక్నో సూపర్‌జెయింట్స్ : డానియల్ శామ్స్, కరుణ్ నాయర్, జైదేవ్ ఉనద్కత్, మనన్ వోహ్రా, కరణ్ శర్మ, సుర్యాంశుషెడ్గె, స్వప్నిల్ సింగ్, అర్పిత్ గులేరియ. (ట్రేడ్ ఇన్ : షెఫర్డ్, అవేశ్ ఖాన్. ట్రేడ్ అవుట్ : దేవదత్ పడిక్కల్)

గుజరాత్ టైటాన్స్ : యశ్ దయాల్, కె.ఎస్ భరత్, శివం మావి, ఊర్విల్ పటేల్, ప్రదీప్ సంగ్వాన్, ఒడీన్ స్మిత్, అల్జారీ జోసెఫ్, దసున్ శనక.

ముంబయి ఇండియన్స్ : అర్షద్ ఖాన్, రమన్‌దీప్ సింగ్, హృతిక్ షోకీన్, రాఘవ్ గోయల్, జోఫ్రా ఆర్చర్, ట్రిస్టన్ స్టబ్స్, డ్వ్యాన్ జాన్సెన్, జై రిచర్డ్‌సన్, రైలీ మెరెడిత్, క్రిస్ జోర్డాన్, సందీప్ వారియర్.

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ : వానిందు హసరంగ, హర్షల్ పటేల్, జోశ్ హేజిల్‌వుడ్, ఫిన్ అలెన్, మైకల్ బ్రాస్‌వెల్, డెవిడ్ విల్లే, వేనీ పార్నెల్, సోను యాదవ్, అవినాశ్ సింగ్, సిద్దార్థ్ కౌల్, కేదార్ జాదవ్.

ఉత్తరకాశీ టన్నెల్ ఘటన నిట్టనిలువుగా డ్రిల్లింగ్ ప్రారంభం

- ఈ నెల 30లోగా పూర్తి చేయాలని లక్ష్యం
- 15వ రోజూ సొరంగంలోనే కార్మికులు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తర్‌కాశీలో టన్నెల్ కూలిన ప్రమాదం నుంచి కార్మికులను బయటకు తీసుకుని రావడం ఆదివారం కూడా సాధ్య పడలేదు. దీంతో వరసగా 15 రోజు కూడా 41 మంది కార్మికులు సొరంగంలోనే చిక్కుకుని ఉన్నారు. సమాంతరంగా తవ్వేందుకు ఉద్దేశించిన ఆగర్ యంత్రం విరిగిపోవడంతో సహాయక కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. ప్రత్యామ్నాయాల్లో భాగంగా కొండ ఎగువ భాగం నుంచి నిట్టనిలువునా కిందకు తవ్వే ప్రక్రియను ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రక్రియలో మొత్తం 86 మీటర్లను 100 గంటల్లో అంటే ఈ నెల 30 లోపు తవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆదివారం సుమారు 19.5 మీటర్ల దూరం తవ్వినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలోకి భారత సైన్యం కూడా రంగంలోకి దిగింది. ధ్వంసమైన ఆగర్ యంత్రాన్ని బయటకు తీయడం, డ్రిల్లింగ్‌లో నిమగ్నం కానుంది. అంతా సజావుగా సాగితే 100 గంటల్లోనే కూలీల వద్దకు చేరుకుంటాం. చుట్టుపక్కల తవ్వే యంత్రాలు కూడా ఆదివారం రాత్రికి సిల్క్యారా చేరుకోనున్నాయి' అని ఎన్‌హెచ్‌ఐడీసీఎల్ ఎండీ మహమూద్ అహ్మద్ వెల్లడించారు. సిల్క్యారా సొరంగంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చేందుకు ఆరు ప్రణాళికలు అమలు చేస్తున్నామన్న ఆయన.. ఇందులో సమాంతరంగా తవ్వుకుంటూ వెళ్లడమే ఉత్తమమైందని అన్నారు. మరోవైపు ఈ పనుల పర్యవేక్షనకు డ్రోన్లను కూడా వినియోగిస్తున్నారు.

రన్నరప్ సాత్విక్ జోడీ

- ఫైనల్లో టాప్ సీడ్ ఓటమి
- చైనా మాస్టర్స్ సూపర్ 750

షెంజెన్ (చైనా) : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ సూపర్‌స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీ రన్నరప్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో వరల్డ్ నం.1 చైనా జోడీ చేతిలో టాప్ సీడ్ సాత్విక్, చిరాగ్ పోరాడి ఓడారు. మూడు గేముల పాటు హోరాహోరీగా సాగిన టైటిల్ పోరులో సాత్విక్ జోడీ 19-21, 21-19, 19-21తో టైటిల్‌ను చేజార్చుకుంది. 71 నిమిషాల పాటు సాగిన ఫైనల్లో మనోళ్లు రెండో గేమ్ నెగ్గినా.. తొలి, చివరి గేమ్‌లను ఆఖర్లో ఓడారు. తొలి గేమ్‌లో 19-19 వద్ద నుంచి వరుసగా రెండు పాయింట్లు కోల్పోయిన సాత్విక్, చిరాగ్‌లు.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో 13-19 నుంచి వరుస పాయింట్లతో పుంజుకున్నా ఫలితం లేకపోయింది. ఈ ఏడాది నాలుగు టోర్నీల్లో ఫైనల్స్‌కు చేరిన సాత్విక్, చిరాగ్‌లకు టైటిల్ పోరులో ఇదే తొలి పరాజయం. మహిళల సింగిల్స్‌లో చెన్ యుఫెయ్ (చైనా), మెన్స్ సింగిల్స్‌లో కొడాయ్ నరొక (జపాన్) చాంపియన్స్‌గా నిలిచారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68